ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -57 పేజీలు - 8 వెల - 03/- మంగళవారం 16 జూన్ 2026

# యుద్ధం ముగిసింది



## ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్

## -ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు

### ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

**వాషింగ్టన్,జూన్ 15( రిపబ్లిక్ న్యూస్):**
పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. నెలల తరబడి ఉత్కంఠ రేపిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని ప్రపంచ దేశాలు ఏకగ్రీవంగా స్వాగతించాయి. ప్రాంతీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి,



వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అంతర్జాతీయ ఆర్థిక రంగానికి ఊరటనిచ్చేందుకు
ఈ ఒప్పందం ఒక అద్భుతమైన దౌత్యపరమైన మలుపు అని ప్రపంచ దేశాల నేతలు అభివర్ణించారు.
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఈ చారిత్రాత్మక ఒప్పందానికి పాకిస్థాన్ ప్రధానంగా మధ్యవర్తిత్వం వహించగా.**మిగతా 2లో...**

### స్వాగతిస్తూ మోడీ ప్రకటన

**సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం**






# దేశసమగ్రతను కాపాడుతాం

**దేశ సమగ్రత, శ్రేయస్సు లక్ష్యంగా జనసేన ఆవిర్భావం**

**12 ఏళ్ల ప్రస్థానంలో అనేక పోరాటాలు..విజయాలు..పరాజయాలు**

**మార్పు కోసం ఎవరైనా ప్రయత్నించ వచ్చు**

**అందుకు కాక్రోచ్ జనతా పార్టీయే ఉదాహరణ**

**జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం సభలో పవన్ కళ్యాణ్**



**న్యూఢిల్లీ,జూన్ 15( రిపబ్లిక్ న్యూస్):**
జనసేన ప్రారంభించినప్పుడు దేశ సమగ్రత, శ్రేయస్సు తప్ప.. తనకు ఏ ఆలోచనా లేదని ఆ పార్టీ అధ్యక్షుడు, డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. పార్టీ స్థాపించినప్పుడు అధికారం వస్తుందో, రాదో కూడా తెలియదన్నారు. 'జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం'**మిగతా 2లో...**



## యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ 2026 ఫలితాలు విడుదల

**మెయిన్స్ పరీక్షకు 13,343 మంది అభ్యర్థుల అర్హత**

**మొత్తం 1,016 పోస్టుల భర్తీకి కొనసాగుతున్న ప్రక్రియ**

**జూన్ 19 నుంచి 28 వరకు మెయిన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ**

**న్యూఢిల్లీ,జూన్ 15( రిపబ్లిక్ న్యూస్):**
యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష 2026 ఫలితాలను సోమవారం (జూన్ 15) విడుదల చేసింది. ఈ పరీక్షలో దేశవ్యాప్తంగా మొత్తం 13,343 మంది అభ్యర్థులు తదుపరి దశ అయిన మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారు. అర్హత సాధించిన అభ్యర్థుల రోల్ నంబర్లతో కూడిన జాబితాను యూపీఎస్సీ తన అధికారిక వెబ్‌సైట్ upsc.gov.inలో అందుబాటులో ఉంచింది.**మిగతా 2లో...**



# పెట్టుబడులు పెట్టండి



**ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం**

**లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు**

**హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టవిటీ**

**ఆక్వాకల్చర్‌లో నంబర్ 1గా ఉన్న ఆంధ్రప్రదేశ్**

**సింగపూర్‌లో ప్రముఖ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు భేటీ**

**అమరావతి,జూన్ 15( రిపబ్లిక్ న్యూస్):**
ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం ఉందని.. లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టవిటీ ఉందని సీఎం చెప్పారు. లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. హార్టికల్చర్‌పై లక్ష కోట్లు ఇన్వెస్ట్ చేయబోతున్నామని..**మిగతా 2లో...**

## డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

**తెలంగాణ వరి ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్**

**రైతులు వాటినే పండించేలా దిశా నిర్దేశం**

**మిల్లర్లు కొనుగోలు చేసే రకాలను పండిస్తే మేలు**

**ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు**

**కేబినేట్ సబ్‌కమిటీలో డిప్యూటి సిఎం భట్టి సూచనలు**



**హైదరాబాద్,జూన్ 15( రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలో 8 మేలురకం వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్ ఉందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం**మిగతా 2లో...**

## వైసీపీ హయాంలో నమోదైన దొంగ ఓట్లను తొలగించాలి

**ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో వాటిని తొలగించాలని : పీవీఎన్ మాధవ్‌డిమాండ్**

**ప్రతి బూత్‌లో కార్యకర్తలు 250 కుటుంబాలను కలవాలని యువమోర్చాకు పిలుపు**

**దేశ వ్యతిరేక శక్తులపై అప్రమత్తంగా ఉండాలని పీవీఎన్ మాధవ్ సూచన**

**అమరావతి,జూన్ 15( రిపబ్లిక్ న్యూస్):**
వైసీపీ హయాంలో నమోదైన దొంగ ఓట్లను తక్షణమే తొలగించాలని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన భారతీయ యువమోర్చా రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..**మిగతా 2లో...**



## మోడీ హామీల అమలుపై చెప్పండి...

## నేను రాజీనామాకు సిద్ధం

**మెట్రో విస్తరణకు మోకాలడ్డిన కిషన్ రెడ్డి**

**హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించిన కేంద్రమంత్రి**

**కెసిఆర్ కనుసన్నల్లో పనిచేస్తున్న గంగాపురం**

**ఎన్‌వోసి ఇప్పించడంలో కూడా విఫలం**

**ఎల్ అండ్ టికి రుణ బదలాయింపును అడ్డుకున్న పెద్దమనిషి**

**అభివృద్ధి జరిగితే పుట్టగతులు ఉండవనే భయంలో బిజెపి**

**మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి లక్ష్యంగా సిఎం రేవంత్ విమర్శలు**

**హైదరాబాద్,జూన్ 15( రిపబ్లిక్ న్యూస్):**
మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు.**మిగతా 2లో...**





2లో.

## పశ్చిమ ప్రాంతానికి సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

**ప్రత్యేక బ్లూప్రింట్‌తో కార్యాచరణ రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**: జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

# పశ్చిమ ప్రాంతానికి సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

## ప్రత్యేక బ్లూప్రింట్‌తో కార్యాచరణ రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## : జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 15)**
కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు శాశ్వతంగా సాగు, తాగునీరు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కర్నూలులోని జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పశ్చిమ ప్రాంత భౌగోళిక పరిస్థితులు, వర్షాభావం, నీటి లభ్యత తదితర అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రత్యేక బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. అవసరమైతే అదనపు వ్యయం భరించి అయినా ఈ ప్రాంతానికి పూర్తి స్థాయిలో సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.యువగళం పాదయాత్ర సందర్భంగా పశ్చిమ ప్రాంత ప్రజల వలసలను గమనించిన మంత్రి నారా లోకేష్, భవిష్యత్తులో వలసలు లేకుండా శాశ్వత నీటి వనరులు కల్పించాలని సూచించారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో జల్ జీవన్ మిషన్ ద్వారా కూడా ఈ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు



పేర్కొన్నారు.రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గత రెండేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఖర్చు చేసిన రూ.24 వేల కోట్లలో సుమారు రూ.12,450 కోట్లు రాయలసీమ ప్రాంతానికే కేటాయించామని మంత్రి తెలిపారు. తుంగభద్ర, శ్రీశైలం, గోరుకల్లు, హంద్రీ-నీవా వంటి కీలక ప్రాజెక్టుల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయించి పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు.
పశ్చిమ ప్రాంతానికి ప్రత్యేక ప్రాజెక్టులపై దృష్టి
గాజులదిన్నె ప్రాజెక్టు మిగిలిన పనుల పూర్తి, గురు రాఘవేంద్ర ప్రాజెక్టు నిర్వహణ, వేదవతి ప్రాజెక్టు వేగవంతం, నగరడోణ రిజర్వాయర్ పనుల పూర్తి, జొన్నగిరి చెరువుకు నీటి సరఫరా, పులికనుమ ప్రాజెక్టు సామర్థ్య పెంపు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల అమలు వంటి అంశాలను ప్రత్యేక కార్యాచరణలో భాగంగా చేపడుతున్నట్లు వెల్లడించారు.
రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), గుండ్రేవుల ప్రాజెక్టులకు సంబంధించిన అంతర్రాష్ట్ర సమస్యలను తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలతో చర్చించి పరిష్కరించనున్నట్లు తెలిపారు.
రాయలసీమను మరోసారి "రత్నాలసీమ"గా తీర్చిదిద్దేందుకు సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత శాఖల సమన్వయంతో కర్నూలు పశ్చిమ ప్రాంత అభివృద్ధికి దశలవారీగా కార్యాచరణ అమలు చేస్తామని స్పష్టం చేశారు.అంతకుముందు మంత్రి జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతో సమావేశమై పశ్చిమ ప్రాంత సాగు, తాగునీటి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, జయ నాగేశ్వర్ రెడ్డి, డా. పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధం ముగిసింది

**. మొదటిపేజీ తరువాయి**
ఖతార్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు దీనిపై హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందం పూర్తయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా అధికారికంగా ప్రకటించారు.
'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! ప్రపంచ నౌకలారా, మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి. ఆయిల్ ప్రవహించనివ్వండి!' అని ట్రంప్ ఉత్సాహంగా ట్వీట్ చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ
డీల్‌తో హర్మూజ్ జలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్-రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం అని జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇరాన్-అమెరికా డీల్ శుభపరిణామం. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మూజ్ జలసంధిని త్వరగా, భేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అన్నారు. ఇరాన్-అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మూజ్‌ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిరశాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరి ఇప్పటికీ స్థిరంగా ఉందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు మేం నిరంతరం మద్దతు ఇస్తాం తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ అభిప్రాయపడ్డారు.

### స్వాగతిస్తూ మోడీ ప్రకటన


అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్వాగతించారు. ఉద్రిక్తతలను ముగించేందుకు ఇరుదేశాలు ఓ అంగీకారానికి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో మోదీ పోస్ట్ చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడింది. ఎన్నో దేశాల్లో ప్రాణనష్టం వాటిల్లింది. ఈ యుద్ధాన్ని ముగించేలా అమెరికా, ఇరాన్ అంగీకారం కుదుర్చుకోవడం స్వాగతించే విషయం. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడం, స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం సాయపడుతుందని భారత్ విశ్వసిస్తోంది. సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీసేలా.. మిగిలిన అంశాల పైనా సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం అని మోదీ రాసుకొచ్చారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేలా ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని టెహ్రాన్ కూడా ధ్రువీకరించింది. దీనిపై స్విట్జర్లాండ్ వేదికగా జూన్ 19న ఇరుదేశాలు సంతకాలు చేయనున్నాయి. హర్మూజ్‌లో అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని తొలగించడం, ఈ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ చమురుపై ఆంక్షలు తదితర అంశాలపై ఇరుదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది.

# మోడీ హామీల అమలుపై చెప్పండి...నేను రాజీనామాకు సిద్ధం

**మొదటిపేజీ తరువాయి**
సోమవారం సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. ఎన్‌వోసి ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు. రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం ఎన్‌వోసి అయినా ఇప్పించరా? అని నిలదీశారు. నిధులు ఇప్పించి ఎన్‌వోసి ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు.కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్-1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఫేజ్-2 నిర్మించుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో ఈ విషయంలో అర్థమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని విమర్శించారు.

# దేశసమగ్రతను కాపాడుతాం

**మొదటిపేజీ తరువాయి**
పేరిట ఢిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పార్టీ స్థాపించి 12 ఏళ్లు పూర్తయిందని, ఈ ప్రయాణంలో చాలా పోరాటాలు చేశామని, పరాజయాలు ఎదుర్కొన్నామని చెప్పారు.మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా 7 ప్రాథమిక సూత్రాలను వదల్లేదు. నిర్దిష్ట ఆచరణాత్మక విధానంతో 21 ఎమ్మెల్యే స్థానాలు, 3 ఎంపీ స్థానాలను సాధించాం. లక్ష మంది సభ్యత్వంతో ప్రారంభమైన పార్టీకి.. 20 లక్షలకుపైగా సభ్యత్వాలు వచ్చాయి. ఇటీవల కాలంలో అన్ని ప్రాంతాల నుంచి వేల మంది పార్టీలో చేరుతున్నారు. పార్టీ ప్రయోజనాల కంటే.. దేశ సమగ్రతకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. దేశ స్ఫూర్తిని కాపాడుకోవడం ఒక రోజుతో అయ్యే పని కాదు. దేశ స్ఫూర్తిని ప్రతితరం ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదని పవన్ మరోమారు స్పష్టం చేశారు. 2014లో ఏపీని విభజించిన తీరును చూసి మాత్రమే ఆవేదన వ్యక్తం చేశాం. విభజన విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు.. అసంతృప్తిని, అశాంతిని సృష్టించింది. అప్పటి నుంచి ఇప్పటికీ వారి ధోరణి మారలేదు. జనసేన సభకు అనుమతివ్వకుండా అడ్డుకోవడమే అందుకు ఉదాహరణ. ఢిల్లీ మెడలు వంచుతాం.. తడాఖా చూపిస్తామంటూ చాలామంది పెద్దలు మాటలు చెబుతారు. వాస్తవానికి అలాంటి నేతలు ఢిల్లీకి రాగానే వెనక్కి తగ్గుతారు. చాలాసార్లు మనకు మనం తక్కువగా అంచనా వేసుకుంటాం. ప్రతి వ్యక్తి కూడా సమాజంలో మార్పు తీసుకురావొచ్చు. ఈ మధ్య కాక్రోచ్ పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో చూస్తున్నాం. కాక్రోచ్ పార్టీని చూస్తే.. చలిచీమల పద్యం గుర్తుకొచ్చింది. చలిచీమలు కూడా బలమైన పామును చంపేస్తాయని పవన్ అన్నారు. ఈ సమావేశంలో మొత్తం ఐదు కీలక తీర్మానాలని ఆమోదించారు.మొత్తం ఐదు తీర్మానాల ద్వారా జనసేన పార్టీ తన రాజకీయ సిద్ధాంతాలను, అభివృద్ధి దృక్పథాన్ని, దేశ సమైక్యతపై నిబద్ధతను మరింత స్పష్టంగా ప్రకటించినట్లు సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశం పార్టీ భవిష్యత్తు కార్యాచరణకు దిశానిర్దేశర చేస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. జాతీయవాదం, దేశ సమైక్యత, వికసిత్ భారత్ లక్ష్యాలు, ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం, యువత ఆకాంక్షలు వంటి కీలక అంశాలపై విస్తృత చర్చలకు వేదికగా నిలిచింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి వచ్చిన పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సుపరిపాలన, జాతీయ భద్రత రంగాల్లో సాధించిన పురోగతిని ప్రస్తావించారు. గత 12 ఏళ్ల పాలన ప్రతి భారతీయుడిలో భరోసా, విశ్వాసాన్ని పెంపొందించిందని అభిప్రాయపడ్డారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంతో దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు.




### అమర స్థూపం వద్ద వీర జవాన్లకు ఘన నివాళి

భారత సైనికుల త్యాగం, ధైర్యం, దేశభక్తికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచే ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ ను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ సందర్శించారు. అమరస్థూపం వద్ద వీర జవాన్లకు పుష్పగుచ్ఛం సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ వందనం సమర్పించారు. కల్నల్ ఆర్.కె. ఆనంద్ , కెప్టెన్ రోహిత్ గార్గ్ నేతృత్వంలో ఈ వందన సమర్పణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు దేశ భద్రత కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల జీవితాలను సైనికాధికారులను వివరిస్తుంటే శ్రద్ధగా ఆలకించారు. సైనికుల ప్రాణత్యాగాల తాలూకు ఔన్నత్యాన్ని తెలుసుకునే అవకాశం దక్కడం, వారికి నివాళులు అర్పించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు

## యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ 2026 ఫలితాలు విడుదల

**మొదటిపేజీ తరువాయి**
.ఈ ఏడాది మే 24న దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. మొత్తం 1,016 సివిల్ సర్వీసెస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, మెయిన్స్‌కు ఎంపికైన వారి జాబితాను నేడు ప్రకటించారు. గతేడాది 1,087 ఖాళీలకు 14,161 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే.మెయిన్స్‌కు అర్హత పొందిన అభ్యర్థులు తప్పనిసరిగా జూన్ 19 నుంచి జూన్ 28, 2026 మధ్య యూపీఎస్సీ పోర్టల్‌లో లాగిన్ అయి డిటైల్డ్ అప్లికేషన్ ఫామ్ నింపాల్సి ఉంటుంది. ఈ సమయంలోనే రూ.200 పరీక్ష ఫీజును చెల్లించాలి. అయితే, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు కల్పించారు.అభ్యర్థులు సాధించిన మార్కులు, కటాఫ్ మార్కులు, ఆన్సర్ కీలను సివిల్ సర్వీసెస్ 2026 తుది ఫలితాలు వెలువడిన తర్వాతే ప్రకటిస్తామని యూపీఎస్సీ స్పష్టం చేసింది. ఏవైనా సందేహాలుంటే యూపీఎస్సీ కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని సూచించింది.

# పెట్టుబడులు పెట్టండి

**మొదటిపేజీ తరువాయి**
ఆక్వాకల్చర్‌లో నంబర్ 1గా ఉన్నామని వివరించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా వివిధ ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుసగా సమావేశాలు నిర్వహించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం వివరించారు. తొలిరోజు పర్యటనలో భాగంగా వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. సప్లై చైన్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై గ్రూప్‌తో చర్చలు జరిపారు. ఆటోమేటెడ్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన భారీ సప్లై చైన్ సిటీని ఏపీలో నిర్మించే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ఆహార ఉత్పత్తులకు వాల్యూఎడిషన్ ద్వారా ఎగుమతులకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఏపీలో అపార అవకాశాలు ఉన్నాయని... ప్రొడక్షన్‌లో కూడా పెట్టుబడులు పెట్టవచ్చన్నారు. 'ఏపీని సందర్శించండి... రాష్ట్రంలో ఉన్న పాలసీలు, అనుకూలతలు చూసి పెట్టుబడులు పెట్టండి' అంటూ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. గూగుల్ క్లౌడ్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ, డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా తీర్చిదిద్దే అంశాలపై ఇరువురి మధ్య చర్చకు వచ్చింది. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై గూగుల్ క్లౌడ్ సహకారాన్ని సీఎం కోరారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థను మరింత శక్తిమంతం చేసేందుకు ఆధునిక క్లౌడ్ సాంకేతికతల వినియోగంపై చర్చించారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రతిపాదించారు. గూగుల్ క్లౌడ్‌తో కలిసి ఏఐ స్కిల్లింగ్, క్లౌడ్ సర్టిఫికేషన్ కార్యక్రమాలను విస్తరించాలని భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వ విజయాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న సంజీవని ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు.

## డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

**మొదటిపేజీ తరువాయి**
ఉందని వెల్లడించారు. తెలంగాణ సోనామసూరి సహా ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలపై రైతన్నలు దృష్టిపెట్టాలని సూచించారు. ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎగుమతి రకాల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచనలు చేశారని తెలిపారు. ఆ 8 రకాల వంగడాలతోనే రైతులకు లాభాలు వస్తాయని వివరించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆదరణ ఉన్న బియ్యం ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచే పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని సూచించారు. రైతులకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై మార్గనిర్దేశర చేయాలని నిర్ణయించామని అన్నారు. డిమాండ్ లేని వరి రకాల సాగును క్రమంగా తగ్గించాలని చెప్పారు. వినియోగదారులు, మిల్లర్లు కోరుకునే వరి రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాల సాగు విస్తరణపై దృష్టి పెట్టాలని భట్టి విక్రమార్క మార్గనిర్దేశం చేశారు. వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పక్రియను కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రైతులకు నష్టాలు రాకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల ప్రణాళిక చేపట్టాలని సూచించారు. నాణ్యమైన బియ్యం ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించామని చెప్పారు. రైతులకు లాభదాయకమైన, ఎగుమతి అవకాశాలు ఉన్న వంగడాలపై ప్రత్యేక ప్రోత్సాహకాలని పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలపై నిరంతర సమీక్షా సమావేశాలు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. తెలంగాణను అధిక విలువ కలిగిన వరి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. రైతు ఆదాయం పెంపు, మార్కెట్ అనుసంధానానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించామని అన్నారు. రైతులకు మెరుగైన ధరలు వచ్చేలా మార్కెట్ డిమాండ్ ఆధారిత వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు

## వైసీపీ హయాంలో నమోదైన దొంగ ఓట్లను తొలగించాలి.

**మొదటిపేజీ తరువాయి**
గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో దొంగ ఓట్లు నమోదయ్యాయని ఆరోపించారు. ప్రస్తుత ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ బోగస్ ఓట్లను పూర్తిగా ఏరివేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం పార్టీ కార్యకర్తలు, ముఖ్యంగా యువమోర్చా శ్రేణులు చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్ పరిధిలో కార్యకర్తలు కనీసం 250 కుటుంబాలను సందర్శించి, ఓటర్ల జాబితాలోని వివరాలను క్షుణ్ణంగా సరిచూడాలని సూచించారు. రాష్ట్రంలో దేశ వ్యతిరేక శక్తులు, అనుమానాస్పద బృందాల కార్యకలాపాలు పెరిగాయని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మాధవ్ హెచ్చరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం సాధిస్తున్న అప్రతిహత ప్రగతిని అడ్డుకునేందుకు కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని ఆయన విమర్శించారు.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు గళం విప్పుతామని ఆయన స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తీరప్రాంతంలో 10 లక్షల తాటిచెట్లను నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. యువమోర్చా నాయకులు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్పష్టమైన కార్యాచరణ (క్యాలెండర్) రూపొందించుకోవాలని మాధవ్ దిశానిర్దేశం చేశారు.

## హైదరాబాద్ నివాసంలో లోకేశ్ దంపతుల పూజలు

### మహాశివుడికి మహాన్యాసక రుద్రాభిషేకం నిర్వహణ

**హైదరాబాద్,జూన్15(ఆర్ఎన్ఎ):**
ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి దంపతులు సోమవారం హైదరాబాద్‌లోని తమ నివాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశిష్టమైన సోమవారం సందర్భంగా లోకేశ్ దంపతులు మహాశివుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు.



ఆయురారోగ్యాలు, రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రుత్వికుల వేదమంత్రాల నడుమ లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కాంక్షిస్తూ లోకేశ్, బ్రాహ్మణి శివారాధన చేశారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేదోక్తంగా నిర్వహించారు. శివానుగ్రహం కోసం లోకేశ్ కుటుంబం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర సుభిక్షం కోసం మహాశివుడిని లోకేశ్ దంపతులు ప్రార్థించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం ప్రత్యేక హారతులు, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు.

# త్వరలో తల్లి, చెల్లిని జగన్ చంపేస్తాడు

**-మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ విష ప్రచారం -త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్**

**-సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి సూపర్ హిట్ చేశాం -మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్**



**అమరావతి, జూన్15( రిపబ్లిక్ న్యూస్) :** గొడ్డలి పార్టీ నేత జగన్ కేవలం ఆస్తుల వ్యామోహంతో తన తోడబుట్టిన చెల్లెళ్లకు, తల్లికి ఘోర అన్యాయం చేస్తున్నారని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాడు బాబాయ్‌ని చంపేసిన జగన్... నేడు ఆస్తుల కోసం తల్లి, చెల్లిని వేధిస్తున్నారని... రాబోయే రోజుల్లో వారిని కూడా చంపేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని మంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో గొడ్డలి పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం నుండి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం వికాసం వైపు అడుగులు వేస్తోంది. 2004 నాటికి సొంత ఇళ్లు అమ్ముకునే స్థితిలో ఉన్న వైఎస్సార్ కుటుంబం, నేడు జగన్ మోహన్ రెడ్డి సంపాదించిన అక్రమాస్తుల కోసం కొట్టుకునే స్థాయికి చేరింది. సొంత తోడబుట్టిన చెల్లెళ్లే తమ అన్న తమకు అన్యాయం చేశాడని బహిరంగంగా చెబుతున్నారని అన్నారు.

**మైనారిటీ సంక్షేమాన్ని నిర్వీర్యం చేసిన జగన్**

గత ఐదేళ్ల జగన్ పాలనలో మైనార్టీల సంక్షేమం పూర్తిగా కుంటుపడింది. నంద్యాల, కర్నూలు, అదోని, గుంతకల్, కదిరి, హిందూపురంలో పీఎంజీవై పథకం ద్వారా నిర్మించిన మైనార్టీల వసతి గృహాల కోసం జగన్ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 270 కోట్లు ఖర్చు చేసింది. కడపలో రూ.23 కోట్లతో నిర్మించిన హజ్ భవన్, గుంటూరులో రూ.16 కోట్లతో నిర్మిస్తున్న క్రిస్టియన్ భవనాన్ని పూర్తి చేసేందుకు ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనలో జగన్‌కు చేతులు రాలేదని మంత్రి ఫరూక్ ధ్వజమెత్తారు. చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ మైనారిటీ ల శ్రేయస్సుకు కట్టుబడి ఉంది. మైనార్టీల సంక్షేమం కోసం రూ. 5,000 కోట్లు కేటాయించాం. దేశంలో ఎక్కడా లేని విధంగా హజ్ యాత్రికులకు రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నాం. ప్రస్తుతానికి 1,630 మంది హజ్ యాత్రకు వెళ్లగా, 331 మందికి లక్ష చొప్పున నిధులు జమ చేశాం. గతంలో మిగిలిపోయిన 72 మందికి కూడా ఈ సాయం అందించాం. ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనాలు అందిస్తున్నాం. తాలీం ఏ హునర్ పథకం ద్వారా వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో రూ.6 కోట్లు ఖర్చు చేసి 250 మంది మైనార్టీ విద్యార్థులను చదివిస్తున్నాం. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఆరుగురు పిల్లలున్నా అందరికీ ఇస్తున్నాం. జగన్ లాగా ఒక్కరికే ఇచ్చి మోసం చేయలేదు. దీనివల్ల మైనారిటీ బిడ్డలు ఎక్కువగా లబ్ధి పొందుతున్నారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడమే లక్ష్యంగా గొడ్డలి పార్టీ కార్యక్రమాలు చేస్తోంది. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైకాపా కార్యకర్తే. నంద్యాలలో అల్లర్లు సృష్టించాలని గొడ్డలి పార్టీ పన్నాగం పన్నింది. రాష్ట్రంలో అశాంతి రేపడమే జగన్ లక్ష్యం. వైసీపీ నిరసనలకు మనుషులు దొరకక గాడిదలు, గుర్రాలతో వినూత్న నాటకాలు ఆడుతున్నారు. గత ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా మేం నిరసనలు చేస్తుంటే అడ్డుకున్నారు, అణచివేశారు. కానీ నేడు చంద్రబాబు పాలనలో గొడ్డలి పార్టీ వారు ప్రశాంతంగా నిరసనలు తెలుపుకునే స్వేచ్ఛ కల్పించామన్నారు.

**కర్నూల్ లో హైకోర్టు బెంచ్**

ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ రాబోతోందని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు. న్యాయవాదుల సంక్షేమానికి రూ. 93 కోట్లు, కోర్టుల అభివృద్ధికి రూ. 190 కోట్లు ఖర్చు చేస్తున్నాం. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోస్టుల భర్తీకి అనుమతులు ఇచ్చాం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి సూపర్ హిట్ చేశాం. ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని నిరంతరం స్మరించుకుంటున్నారు. జగన్ ఇచ్చిన హామీల్లో 85 శాతం హామీలకు ఎగనామం పెడితే... మేం 90 శాతం హామీలను అమలు చేసి చూపించాం. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నాం. గొడ్డలి పార్టీ విష ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు అని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు.

# అర్జీదారులకు నాణ్యమైన ఎండార్స్మెంట్ అందించాలి

**పీజీఆర్ఎస్‌లో 408 ప్రజా దరఖాస్తుల స్వీకరణ -ప్రజల సంతృప్తే ప్రభుత్వ లక్ష్యం : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూన్ 15( రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీకి నాణ్యమైన, స్పష్టమైన ఎండార్స్మెంట్ అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్ఓ రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కార ప్రక్రియపై నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తోందన్నారు. అర్జీ స్వీకరణ నుంచి ఎండార్స్మెంట్ జారీ చేసే వరకు ప్రజల సంతృప్తి స్థాయిని ఉన్నతాధికారులు ఫోన్ కాల్స్ ద్వారా తెలుసుకుంటున్నారని తెలిపారు. పాణ్యం తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించిన 19 ఫోన్ కాల్స్‌లో ప్రజలు వంద శాతం సంతృప్తి వ్యక్తం చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఎండార్స్మెంట్ అర్జీదారునికి సులభంగా అర్థమయ్యే స్పష్టమైన తెలుగు భాషలో ఉండాలని సూచించారు. అర్జీల పరిష్కారానికి ముందు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి, విచారణ నిర్వహించి, అనంతరం సరైన ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సమస్యలను పరిష్కరించడంతో పాటు, పరిష్కారం సాధ్యం కాని సందర్భాల్లో వారు అనుసరించాల్సిన న్యాయపరమైన మార్గాలను కూడా వివరించాలని సూచించారు. సీఎంఓ కార్యాలయం నుంచి జిల్లాకు సంబంధించిన పలు అర్జీలను పరిశీలిస్తూ, ఫిర్యాదు స్వరూపం, దానికి అధికారులు ఇచ్చిన ఎండార్స్మెంట్ తదితర అంశాలపై కలెక్టర్ అధికారులకు అవగాహన కల్పించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత పెంచేందుకు అర్జీదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి కోసం ఐగాట్ కర్మయోగి వేదికలో అందుబాటులో ఉన్న కోర్సులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యాలయాల కార్యకలాపాలన్నీ ఈ-తపాల్ ద్వారానే పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారిన ప్రభుత్వ పాఠశాల భవనాలు, హాస్టళ్లు, వైద్యశాలలను గుర్తించి, విద్యార్థులు మరియు ప్రజల భద్రత దృష్ట్యా వాటిని కూల్చివేసేందుకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 944 అర్జీలు పెండింగ్**

వన్ మంత్ - ఫోర్ విజిట్స్' కార్యక్రమంలో భాగంగా గత నెల నాలుగు వారాలపాటు ఆళ్లగడ్డలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మొత్తం 2,074 అర్జీలు స్వీకరించగా, వాటిలో 1,130 అర్జీలు పరిష్కారమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం 944 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, అందులో రెవెన్యూ శాఖకు చెందిన 494, సర్వే సంబంధిత 177 అర్జీలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. పెండింగ్ దరఖాస్తులను గురువారంలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 242 దరఖాస్తుల స్వీకరణ**

భూ సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయని కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా క్షేత్రస్థాయిలో భూ సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతోందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 242 దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ మరియు గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 3, అడంగల్ సవరణలకు సంబంధించినవి 42, చుక్కల భూముల క్రమబద్ధీకరణ మరియు 22-ఎ భూములకు సంబంధించినవి 19, అసైన్డ్ భూములు మరియు భూ ఆక్రమణలకు సంబంధించినవి 47, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 94, సర్వే మరియు రీ-సర్వేలకు సంబంధించినవి 34, దేవాదాయ మరియు వక్ఫ్ భూములకు సంబంధించినవి 3 దరఖాస్తులు ఉన్నాయని వివరించారు.



**పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ముఖ్య అర్జీలు**

1)డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన జెట్టి మధు, సర్వే నంబర్ 334/1లో తనకు ఉన్న మూడు ఎకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

2)రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన అక్కల వెంకటరమణ, సర్వే నంబర్ 187లో ఉన్న 2.15 సెంట్ల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాసుపుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.

# కర్నూలులో ఘనంగా ఎన్డీఏ విజయోత్సవ సభ

**రెండేళ్ల పాలన విజయాలను వివరించిన నాయకులు అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యమని స్పష్టం**







**కర్నూలు, జూన్ 15( ప్రజా రిపబ్లిక్ న్యూస్): -** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కర్నూలులోని బైరెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఎన్డీఏ విజయోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షురాలు, జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ, కార్పొరేషన్ చైర్మన్లు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ తదితరులు సభలో పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయోత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన, ప్రజా సేవల రంగాల్లో సాధించిన పురోగతిని వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళు న్నామనితెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పలు ప్రజాహిత కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత సమర్థవంతమైన పాలన అందించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని నాయకులు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. ప్రజా సంక్షేమం, అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని నాయకులు పునరుద్ఘాటించారు.

# కోనేరు పనుల పరిశీలన



**బండి ఆత్మకూరు ,జూన్ 15,రిపబ్లిక్ న్యూస్):-** బండి ఆత్మకూరు మండలం కడమల కాల్వ గ్రామంలోని శ్రీ నవనందీశ్వర ఆలయాల్లో ప్రముఖమైన శివనంది ఆలయంలో జరుగుతున్న కోనేరు నిర్మాణ పనులను అధికారులు పరిశీలించారు. సోమవారం గ్రౌండ్ వాటర్ ఏడి రఘురాం, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, పిడి డ్వామా సూర్యనారాయణలు శివ నంది క్షేత్రంలో పర్యటించారు. ఉపాధి పనుల్లో భాగంగా క్షేత్రంలో జరుగుతున్న కోనేరు నిర్మాణ పనులను వారు పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట మండల స్పెషల్ ఆఫీసర్ లీలావతి, ఈపిడి సాంబశివరావు సూపర్వైజర్ రమాదేవి, దేవస్థానం చైర్మన్ పుష్పరాజ్, ఉపాధి హామీ సిబ్బంది గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రసాయన రహిత సేంద్రీయ ఎరువులు చల్లుకోవాలి

**-డిపిఎం శ్రీనివాసులు,ఏఓ పవన్ కుమార్**



**బండి ఆత్మకూరు, జూన్ 15, (రిపబ్లిక్ న్యూస్):-** రైతులు రసాయన రహిత సేంద్రీయ ఎరువులు మాత్రమే చల్లుకుని భూసారాన్ని పెంపొందించుకోవాలని నంద్యాల జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ లు సూచించారు. సోమవారం బండి ఆత్మకూరు మండలం, సంత జూటూరు గ్రామంలో పిఎం డిఎస్ సోయింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై పలు కీలక సూచనలు చేశారు. రసాయన రహిత సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి పొందడమే కాకుండా నేలలో కర్బన శాతం, సూక్ష్మ పోషకాలు అధికంగా పెంపొందించవచ్చునన్నారు. సేంద్రీయ ప్రకృతి వ్యవసాయలో వరి సాగు చేయడం వల్ల నేలకు నత్రజని అందిచడము, పిఎండిఎస్ ద్వారా పోషకాలు ఎక్కువగా ఉన్నందున పశువుల మేతగా ఉపయోగడుతుందని తెలిపారు. రైతులు మిశ్రమ పంటలు వేసుకోవాలని, వరి సాగు చేసే పొలంలో జీలుగా, పిల్లి పెసర ,ఉలవలు వంటి పచ్చిరొట్ట పంటలు లేదా పీఎండిఎస్ ప్రీ మానుసూన్ డ్రై సోయింగ్ వేసుకోవాలని కోరారు. బండి ఆత్మకూరు మండలం పూర్తిగా వరి పండించే ప్రాంతం కాబట్టి వరితోపాటు వరిగడ్డి రైస్ బ్రాన్ ఆయిల్, పశువుల మేతకు డిమాండ్ ఉన్నందున రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థికంగా లబ్ధి పొందాలని రైతులను కోరారు. ఏఓ పవన్ కుమార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఫార్మర్ ఐడి తప్పనిసరిగా పొందాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ క్షేత్రం వద్ద సీతాఫలం, మునగ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సునందన, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కరీం భాష ,మహేంద్ర, హుస్సేన్ శ్రీ కుమార్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల్లో శ్రమ దోపిడీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**కనీస వేతనాలు, ఈఎస్ఐపీఎఫ్ అమలుపై విచారణ చేపట్టాలని సివిల్ రైట్స్ సంస్థ విజ్ఞప్తి**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 15)** కర్నూలు నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బంది తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆరోపిస్తూ, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కౌన్సిల్ ఆఫ్ సివిల్ రైట్స్ అండ్ విజిలెన్స్ (సీసీఆర్వీ) సంస్థ జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి వై. కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, నగరంలోని అనేక ప్రైవేట్ ఆసుపత్రుల్లో నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎక్స్‌రే టెక్నీషియన్లు, రిసెప్షనిస్టులు, అటెండర్లు, పారిశుద్ధ్య కార్మికులతో రోజుకు 10 నుంచి 12 గంటలపాటు పని చేయించుకుంటున్నప్పటికీ, చట్టప్రకారం చెల్లించాల్సిన కనీస వేతనాలు ఇవ్వడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా ఉద్యోగంలో చేరిన తొలి రోజు నుంచే అమలు చేయాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సామాజిక భద్రతా పథకాలను చాలా ఆసుపత్రులు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఉద్యోగుల జీతాలను బ్యాంకు ఖాతాల ద్వారా కాకుండా నగదు రూపంలో చెల్లిస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాత్కాలిక ఉద్యోగుల పేరుతో కార్మికుల హక్కులను కాలరాస్తున్న ఆసుపత్రులపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీసీఆర్వీ సంస్థ కలెక్టర్‌ను కోరింది. ఈ సందర్భంగా వై. కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, బాధిత కార్మికులకు న్యాయం జరిగేలా మరియు కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న ఆసుపత్రులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకునేలా సంస్థ తరపున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# మాజీ ఏం పి పి ని మర్యాద పూర్వకంగా కలిసిన రామిరెడ్డి ద్వాజారెడ్డి.





**రైల్వే కోడూరు జూన్ 15రిపబ్లిక్ న్యూస్.** చిట్వేలి మండలం మాజీ మండలప్రజాపరిషత్ అధ్యక్షుడు నాగిరెడ్డి నరసింహారెడ్డి ని మర్యాదపూర్వకంగా, రైల్వే కోడూరు వై యస్ ఆర్ సి పి రాష్ట్రఎక్సక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు, మండల ఉపాధ్యక్షుడు రామిరెడ్డి ద్వాజారెడ్డి సోమవారం మధ్యాహ్నం కలిశారు, ఇరువురు నాయకులు చిట్వేలి మండలంలో పార్టీ బలోపేతం గురించి చర్చించినట్లు ధ్వజారెడ్డి తెలియజేశారు మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు బూత్ కమిటీ లీడర్లు ముఖ్యమైన కార్యకర్తల అందరితో కలిసి ఏ విధంగా ప్రజల్లోకి పార్టీని తీసుకెళ్లాలి ప్రజా సమస్యలను తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి పార్టీ పరంగా మనం కృషి చేయాలని ఆయన చర్చించినట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల సీనియర్ నాయకులు ప్రదీప్ రెడ్డి, సర్పంచ్ ఈశ్వర్, రమణ రెడ్డి,అనంతరాజుపేట మనీ , మైనారిటీ మండల నాయకులు షఫీ , లక్ష్మీపతి మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జెడ్. వీరారెడ్డి కాలనీ సమస్యలు వెంటనే పరిష్కరించాలి: సీపీఎం ధర్నా

**అనంతపురం/గుత్తి, జూన్ 15: (రిపబ్లిక్ న్యూస్ )**




జెడ్. వీరారెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గుత్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యాలయం ప్రధాన గేటు వద్ద నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వి. నిర్మల మాట్లాడుతూ, జెడ్. వీరారెడ్డి కాలనీకి సరైన ప్రధాన రహదారి లేకపోవడంతో వర్షాకాలంలో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాలనీలో సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని, మరమ్మతులకు గురైన వీధి దీపాలను వెంటనే బాగు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. వార్డుల్లో ఉన్న స్పాట్ డెలివరీ ట్యాంకులకు సంబంధించిన విద్యుత్ మోటార్లు చెడిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్ యాదవ్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చందు, నాయకులు వన్నూరమ్మ, ఊర్మిళ, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల ప్రారంభం

**అనంతపురం/గుంతకల్, జూన్ 15: (రిపబ్లిక్ న్యూస్)**



గుంతకల్ పట్టణంలోని హనుమాన్ సర్కిల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ వెన్నపూస విశ్వనాథ్ రెడ్డి ఆహ్వానం మేరకు గుంతకల్ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి ముఖ్య అతిథిగా హాజరై కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ, ఎన్ఆర్ఐ విద్యాసంస్థలు రాష్ట్రంలోని అనేక పట్టణాల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ వేలాది మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చాయని అన్నారు. ఇప్పుడు గుంతకల్ విద్యార్థులకు కూడా అలాంటి విద్యా అవకాశాలు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా నీట్ , ఐఐటి – జేఈఈ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ అందించడం, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, ఆధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ లెర్నింగ్ విధానాలు ఈ కళాశాల ప్రత్యేకతలని తెలిపారు. విద్యార్థులకు ట్యాబ్‌లు, డిజిటల్ పాఠ్యాంశాల ద్వారా బోధన అందించడం వల్ల వారి ప్రతిభ మరింత మెరుగుపడుతుందని చెప్పారు. గుంతకల్ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యలో రాణించాలని, తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# ఘనంగా నారాయణ విద్యాసంస్థల చైర్మన్ జన్మదిన వేడుకలు

**అనంతపురం సంక్షేమం, జూన్ 15,(రిపబ్లిక్ న్యూస్):**



నారాయణ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పి. నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని సాయినగర్ నారాయణ జూనియర్ కళాశాలలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనంతపురం నారాయణ కళాశాల కోర్ డీన్ బి.కె. బద్రీనాథ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి డాక్టర్ పి. నారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యా రంగంలో ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు.

**విద్యా రంగంలో ఆయన సేవలు తరతరాలకు ఆదర్శం**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ విద్యాసంస్థలను జాతీయ స్థాయి విద్యా ఉద్యమంగా తీర్చిదిద్దిన ఘనత డాక్టర్ పి. నారాయణదేనని కొనియాడారు. నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, ఫలితాల సాధనకు ప్రతీకగా నారాయణ విద్యాసంస్థలను నిలబెట్టి, లక్షలాది మంది విద్యార్థులను దేశ అత్యున్నత విద్యాసంస్థలకు పంపించిన దూరదృష్టి గల విద్యావేత్తగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, ప్రపంచ స్థాయి పోటీలకు సిద్ధం చేసే విద్యా విధానాలకు ఆయన ఆద్యుడని, విద్యా రంగంలో ఆయన సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డీజీఎం ఎస్. వెంకటరమణ రెడ్డి, ప్రిన్సిపాల్ పి. శ్రీధర్ బాబు, ఏఓలు డాక్టర్ కె. చెన్నకేశవులు, కె. ఓబన్న, ఈ. నరేష్‌తో పాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం వైసీపీకి ఇష్టం లేదు

**-బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి విమర్శలు**



**అనంతపురం సంక్షేమం, జూన్ 15,(రిపబ్లిక్ న్యూస్ ):**రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించకుండా అడ్డుకోవడమే వైసీపీ లక్ష్యంగా పనిచేస్తోందని బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర యువజన మంత్రిత్వ శాఖ జాతీయ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 16,347 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయగా, దానిని రద్దు చేయించేందుకు వైసీపీ మొదటి నుంచే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. కేంద్ర క్రీడా అకాడమీ మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాలో 382 మందికి ఉద్యోగాలు కల్పించిందని, ఇందులో ఎలాంటి వివక్ష లేదన్నారు. అయినప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో వైసీపీ 247 మందితో కోర్టు కేసులు వేయించిందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుద్యోగ యువతకు ద్రోహం చేశారని, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఉద్యోగాల విషయంలో కూడా కుల రాజకీయాలను తెరపైకి తీసుకురావడం దురదృష్ట కరమన్నారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్షం, యువత ఉద్యోగ అవకాశాలను అడ్డుకునే చర్యలకు దిగడం సరికాదన్నారు. ఇప్పటికైనా వైసీపీ తన వైఖరి మార్చుకుని ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ కణంపల్లి చిరంజీవి రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు అంకాల్ రెడ్డి, మీడియా అధికార ప్రతినిధి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, సూర్యప్రకాశ్, చంటి, చక్రధర్ యాదవ్, నాగేంద్ర, దామోదర్, ప్రతాప్, ఫయాజ్, పోగుల నాగేంద్ర, గొడుగు నాగరాజు, ఇంతియాజ్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య, వైద్యానికి చేయూతనివ్వండి

**జిల్లా కలెక్టర్ కు ఏపీడబ్ల్యూజేఎఫ్ వినతి**





**అనంతపురం కలెక్టరేట్, జూన్ 15,(రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన అర్హులైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఉచిత విద్య, వైద్య సదుపాయం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షఫీవుల్లా, రేపటి రామాంజినేయులు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఓ. ఆనంద్ కు ప్రత్యేకంగా వినతి పత్రం అందజేశారు.

**విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత విద్యను అందించాలి**

ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో 700కి పైగా అక్రిడిటేటెడ్ జర్నలిస్టులు ఉన్నారని, వీరిలో అత్యధిక మందికి వేతనాలు కూడా రాని దుర్భర పరిస్థితులు ఉన్నాయన్నారు. పేద జర్నలిస్టులు ప్రధానంగా పిల్లలకు విద్య, వైద్య ఖర్చులు అధికమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ రెండు సమస్యల పరిష్కారానికి జర్నలిస్టు కుటుంబాలకు తగిన సహకారం, తోడ్పాటు అందించాలని జిల్లా జర్నలిస్టుల తరుపున విజ్ఞప్తి చేశారు. విద్యకు సంబంధించి గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాల ప్రకారం అమలు చేస్తూ వస్తున్నారని, అయితే ప్రస్తుతం ఇచ్చిన జీవోలో ఉచిత విద్య ఎంత శాతం అందిస్తారనేది స్పష్టత లేదన్నారు.

**విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి**

విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత విద్యను జర్నలిస్టుల పిల్లలకు అందించాలని ఉత్తర్వుల్లో పొందుపరచడం వల్ల సాంకేతిక సమస్య ఉత్పన్నమైందని గుర్తు చేశారు. కావున ఇటీవల ఇచ్చిన జీవోలో మార్పులు చేసి ఈ ఏడాది అనంతపురం జిల్లాలోని జర్నలిస్టు పిల్లలకు అన్ని కార్పొరేట్ /ప్రైవేట్ పాఠశాలల్లో పూర్తిగా ఉచిత విద్యను అందించేలా విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వైద్యానికి సంబంధించి ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించిందని, ప్రీమియం చెల్లింపునకు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మానవతా దృక్పథంతో జర్నలిస్టుల సంక్షేమం కోసం పాత జీవోలో తగిన మార్పులు చేసి తాజాగా ఉత్తర్వులు ఇవ్వాలని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల అసోసియేషన్లు, యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఉచిత విద్య అందించేలా సహకరించాలని విన్నవించారు. జర్నలిస్టుల విజ్ఞప్తికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల అసోసియేన్ల ప్రతినిధులు, యాజమాన్యాలతో త్వరలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తగిన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సూర్య, ఉద్దండం చంద్ర శేఖర్, నగర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవ్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బడి ప్రారంభం రోజే విద్యా కానుక ఇవ్వలేరా

- ప్రభుత్వ విద్యార్థుల మీద కూటమికి నిర్లక్ష్యం ఎందుకు
- గత వైస్సార్సీపీలో స్కూల్ మొదటి రోజే విద్యా కానుక
- జిల్లా కలెక్టర్ కు వైస్సార్సీపీ విద్యార్థి, యువజన నాయకులు వినతిపత్రం
- ప్రభుత్వ విద్యని నాశనం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- కార్పొరేట్ విద్యకి కొమ్ముకాస్తూ
- ప్రభుత్వ విద్యకి తూట్లు పొడుస్తున్న కూటమి సర్కారు






**అనంతపురం కలెక్టరేట్, జూన్ 15,(రిపబ్లిక్ న్యూస్):**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తక్షణమే విద్యా సామగ్రిని అందించాలని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం విడాలని కోరారు.
సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో యువజన, విద్యార్థి నాయకులు జిల్లా కలెక్టర్ ఆనంద్ కు వినతిపత్రం అందజేశారు.

**నేడు ప్రభుత్వ విద్యను నీరుగార్చే విధంగా కూటమి ప్రభుత్వం**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కరువు జిల్లాగా పేరొందిన అనంతపురంలో పేద విద్యార్థులు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు,యూనిఫాంలు, షూస్,సాక్స్, బెల్ట్‌లు, ఇంగ్లీష్‌తెలుగు నిఘంటువులు,వర్క్‌బుక్స్ వంటి కనీస అవసరాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని మండిపడ్డారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో జగన్ అన్న విద్యా కానుక ద్వారా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు అవసరమైన అన్ని వస్తువులు సమయానికి అందించారన్నారు. మాజీ సీఎం జగన్ పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించారని గుర్తు చేశారు. నేడు ప్రభుత్వ విద్యను నీరుగార్చే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన బాధ్యతను పక్కనపెట్టి,విద్యార్థుల సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా బలోపేతం చేయాల్సిన సమయంలో కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తూ, పేద విద్యార్థులను మరింత ఇబ్బందులకు గురిచేసే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తోందని తీవ్రంగా విమర్శించారు.

**ప్రభుత్వ విద్యను పరిరక్షించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి**

డిజిటల్ యుగంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి, నాణ్యమైన ఐబీ సిలబస్ ఆధారిత విద్యను అందించే దిశగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యను హక్కుగా కాకుండా భారంగా మార్చే విధానాలను వెంటనే విరమించాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వ విద్యను పరిరక్షించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. అనంతపురం వంటి వెనుకబడిన జిల్లాల్లో విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయ ప్రయోగాలు చేయొద్దని హితవు పలికారు. , వెంటనే విద్యా కానుక ను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ యువజన విభాగం నగర అధ్యక్షులు శ్రీనివాస్ గురుదత్త, ఉపాధ్యక్షులు ఉదయ్, వినీత్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇండ్ల విజయ్ కుమార్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, నగర అధ్యక్షులు కైలాష్ నాయకులు నంద కిషోర్,సాయి,పులి కార్తికేయ,గౌరీ శంకర్, శారీక్,లోకేష్,రాహుల్ రెడ్డి, శివ,రఫీ, ఫయాజ్,గంగ శివుడు, రాఘవ తదితరులు పాల్గొన్నారు

# కప్పట్రాళ్ల రైతు సేవ కేంద్రంలో ఎరువులు, విత్తనాల పంపిణీ

**రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి:- సీనియర్ నాయకుడు కప్పట్రాళ్ల మల్లికార్జున**





**దేవనకొండ,జూన్15(ప్రజారీపబ్లిక్ న్యూస్):-**
దేవనకొండ మండలంలోని కపట్రాళ్ల గ్రామంలో రైతుల సంక్షేమం,వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా కప్పట్రాళ్ల రైతు సేవ కేంద్రంలో రైతులకు ఎరువులు మరియు నాణ్యమైన విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కప్పట్రాళ్ల మల్లికార్జున ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను స్వయంగా అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అని, రైతుల అభ్యున్నతే రాష్ట్రాభివృద్ధికి పునాది అని అన్నారు. సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన వ్యవసాయ సామగ్రి అందుబాటులో ఉంచడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతోందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలుస్తున్న నాయకత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సురేంద్రనాయుడు, పెద్ద కౌలుట్లయ్య. వెంకటేష్, ఎర్ర కౌలుట్ల, చాకలి లక్ష్మన్న, సుంకన్న, శివలింగడు, తిప్పన్న, గిడ్డయ్య, హార్టికల్చర్ అసిస్టెంట్ నాగన్న, అగ్రికల్చర్ అసిస్టెంట్ రంగన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు
స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# వర్షాకాలానికి ముందే డ్రైనేజీల పూడికతీత పనులు వేగవంతం

**రూ.2.39 కోట్లతో 134.28 కి.మీ. మేర ప్రత్యేక పనులు చెత్తను కాలువల్లో వేయొద్దని ప్రజలకు కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 15)**
నగరంలో వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా డ్రైనేజీ కాలువల పూడికతీత పనులను ముమ్మరంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. కిడ్స్ వరల్డ్ సర్కిల్, వడ్డేగిరి, బంగారుపేట, గాంధీనగర్, ఆనంద్ టాకీస్ జంక్షన్, సీతారాంనగర్, రామలింగేశ్వర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య, పూడికతీత పనులను ఆయన పరిశీలించారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వర్షాలు ఎప్పుడు కురిసినా డ్రైనేజీ వ్యవస్థలో నీరు సాఫీగా ప్రవహించేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగర వ్యాప్తంగా రూ. 2.39 కోట్ల వ్యయంతో 134.28 కిలోమీటర్ల మేర ప్రత్యేక పూడికతీత పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపునకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.
అదేవిధంగా కె.సి. కెనాల్‌లో రూ. 10 లక్షల వ్యయంతో 3.5 కిలోమీటర్ల మేర స్వచ్ఛత పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని అంతర్గత డ్రైనేజీ కాలువల్లో ప్రతి రోజు మధ్యాహ్నం పూడికతీత కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.
డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం వేయడం వల్ల వరద నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కమిషనర్ హెచ్చరించారు. నగరపాలక సంస్థ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇంటి వ్యర్థాలను మున్సిపల్ సిబ్బందికే అందించాలని, సిబ్బంది రాకపోతే 18004259766 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.
ఈ పరిశీలన కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు అనిల్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# వివి కండ్రికలో భూ కబ్జాలు, అరికట్టాలి

## పేదలకు పంపిణీ చేయాలి: కామ్రేడ్లు.




**రైల్వే కోడూరు జూన్ 15 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరుమండలం వివి కండ్రికలో భూకబ్జాలు విపరీతంగా జరుగుతున్నాయని, రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని కామ్రేడ్లు ఆరోపించారు,సిఐటియు ఆధ్వర్యంలో, సోమవారం కోడూరు మండల తహసీల్దార్కార్యాలయం వద్ద, ధర్నా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు, సిహెచ్ చంద్రశేఖర్, ఆర్ వెంకటేష్, మాట్లాడుతూ వివి కండ్రికలో, 130 సర్వే నెంబర్లు, 1400 ఎకరాలు ఉందని, అందులో అనేక వందలు ఎకరాలు ఇతర ప్రాంతాల వారు అక్రమంగా బోగస్ పట్టాలతో సాగు చేస్తున్నారని ఆరోపించారు. అందులో 300 ఎకరాలు మైనింగ్ పేరుతో, గత 50 సంవత్సరాలు క్రితం అక్రమ మైనింగ్ లీజులు ఇచ్చారన్నారు, గత 20 సంవత్సరాల క్రితం ఆలీజులు గడువు ముగిసిందని, అందులో అనేకమంది, అగ్రవర్ణ భూస్వాములు, రాత్రికి రాత్రి, జెసిపి మిషన్ల సహాయం తో చదునుచేసి , మామిడి చెట్లునటరాని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులు, గిరిజనలు, సెంటు భూమి లేకుండా, వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారని, వారికి ఆ భూమిలో పట్టాలిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే, సిఐటియు, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో, పేదలకు భూ పంపిణీ చేపడతామని హెచ్చరించారు. గత ప్రభుత్వంలోనూ, ఈ ప్రభుత్వంలోనూ, పేదలకు ఒక సెంటు భూమి ఇవ్వలేదని ఆరోపించారు. తక్షణం భూ అక్రమాలు అరికట్టాలని, పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు కోడూరు మండలం కన్వీనర్ పి.జాన్ ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ బొజ్జ శివయ్య, కెవిపిఎస్ జిల్లా నాయకులు, ఓబిలి పెంచలయ్య, స్థానిక నాయకులు, పంత గిరి వెంకటరమణ, శివకృష్ణ. దమ్ము చంద్ర, రాజమ్మ, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలకు సత్వర పరిష్కాం.

## తహసీల్దార్ సిద్ధేశ్వరరావు.



**రైల్వే కోడూరు, జూన్ 15 రిపబ్లిక్ న్యూస్.**
ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు మండల తాసిల్దార్ సిద్దేశ్వర రావు అధికారులకు సూచించారు, మండలంలో సుధీర ప్రాంతాల నుండి రైతులు ప్రజలు వ్యయ ప్రయాసలకు వచ్చి ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగకుండా సత్వర పరిష్కార మార్గాలు వెతికి ఆ ఆ సమస్యలకు పరిష్కారం చూపిస్తే వారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగవలసిన అవసరం ఉండదని తహసీల్దార్ సిద్ధేశ్వరరావు అన్నారు,సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాసిల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది, కార్యక్రమంలో ఆయన రైతులు,ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ సిద్దేశ్వర రావు మాట్లాడుతూ భూమి కొలతలు, ఇంటి స్థలాలు, ఆన్లైన్ మ్యూటేషన్, కొత్తగా ఆధార్ కార్డు లేనివారు ఆధార్ కార్డు చేసుకోవడానికి సరైన పత్రాలు లేక అవస్థలు పడుతున్న వారు ఆధార్ కార్డులో వివరాల మార్పులు నూతన రేషన్ కార్డులు తదితర అంశాలకు సంబంధించిన పలు వినతులు అందినట్లు తెలిపారు. అందిన ప్రతి వినతిని పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి మల్లికార్జున రెడ్డి,మండల సర్వేర్ నాగలక్ష్మి,వీఆర్వోలు షేక్ భాను, శంకరయ్య, అంబారపు శ్రీనివాసులు, మనోహర్, వీఆర్ఏ లు బొమ్మి రాంప్రసాద్, పేరయ్య, సిగమాల నవనీత్, రైతులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించిన టీడీపీ నాయకులు



**అనంతపురం/గుత్తి, జూన్ 15: (రిపబ్లిక్ న్యూస్)** గుత్తి పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన సుంకమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గుంతకల్లు నియోజకవర్గ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు, గుత్తిపామిడి మండలాల ఇన్చార్జి యువనేత గుమ్మనూరు ఈశ్వర్ ఆశయాలకు అనుగుణంగా గుత్తి పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఎం.కే. చౌదరి మృతురాలి కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీతో పాటు గుమ్మనూరు కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు బోర్వెల్ నాగరాజు, డాక్యుమెంట్ రైటర్ రామకృష్ణ, అశ్వ చిన్న మారన్న, చిన్న పుల్లన్న, అశ్వ సురేష్, అశ్వ నాగప్ప, ఎడ్లపల్లి ఈశ్వరయ్య, కళ్యాణం సుంకన్న, చిన్న వీరన్న, విభూతి సుంకయ్యతో పాటు జంగాల కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆయుర్వేద ఆసుపత్రికి వైద్యుడిని నియమించాలి


## రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకుల డిమాండ్



**శ్రీ సత్యసాయి / ఓడీ చెరువు, జూన్ 15,(రిపబ్లిక్ న్యూస్):**
శ్రీ సత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో వైద్యుడు, సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆయుర్వేద ఆసుపత్రి భవనం ఉన్నప్పటికీ వైద్యుడు లేకపోవడం, తగిన సిబ్బంది లేకపోవడం వల్ల ప్రజలకు ఆశించిన స్థాయిలో వైద్య సేవలు అందడం లేదన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన ఆయుర్వేద మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో అరకొర మందులతోనే వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. వైద్యుడు ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి ఉండటంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు, మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే శాశ్వత ఆయుర్వేద వైద్యుడిని నియమించి, అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు అన్ని రకాల మందులను అందు బాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ పుట్టపర్తి డివిజన్ నాయకులు మున్నా, సురేష్కుమార్, వెంకటేష్, సత్యప్ప, రవి, నాగరాజు, కృష్ణమూర్తి, శివశంకర్, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ పనులను వేగవంతం చేయాలి

## పకడ్బందీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, జూన్ 15( రిపబ్లిక్ న్యూస్):**
అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీఓలు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), జలధార – జల హారతి, అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, వయోజన విద్యాశాఖ డీడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల ప్రాంగణాల్లో చేపట్టాల్సిన మొక్కల పెంపకం కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు మరింత చొరవ చూపి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కేవలం కొంతమంది అధికారుల బాధ్యతగా కాకుండా, అన్ని శాఖలు సమన్వయంతో అమలు చేయాలని సూచించారు. స్థలం లేకపోవడం, రాతినేలు, ప్రహరీ గోడల సమస్యలు వంటి కారణాలతో పనులను వాయిదా వేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించాలని, అవసరమైన అంచనాలు సిద్ధం చేసి పిట్టింగ్, మొక్కల నాటే కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. పాఠశాలలు, వసతి గృహాల వారీగా పనుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తామని, నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి ఉన్నందున జిల్లాలో ఆదర్శప్రాయంగా అమలు చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న 1,629 మంది బీఎల్ఓలకు ఎలాంటి ఇతర విధులు అప్పగించకుండా చూడాలని ఆదేశించారు. బీఎల్ఓలుగా పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులను ఎన్నికల విధులకు పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. జిల్లాలోని సుమారు 14 లక్షల మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను ఫొటోగ్రాఫ్లతో సహా డిజిటలైజేషన్ చేయాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు ఇప్పటికే పూర్తయ్యాయని, సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అప్పటి వరకు ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి బదిలీలు ఉండవని పేర్కొన్నారు. ఉల్లాస్ 100 రోజుల కార్యక్రమాన్ని లక్ష్యాలకు అనుగుణంగా అమలు చేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. మ్యాపింగ్ పూర్తి కాని ప్రాంతాల్లో ఏపీఓలు, ఏపీఎంలు, ఇతర సిబ్బంది సహకారంతో పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జలధార – జలహారతి కార్యక్రమం కింద జిల్లాలో మొత్తం 2,103 పనులు మంజూరవగా, 1,044 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 1,059 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా బనగానపల్లి, పాణ్యం, ప్యాపిలి, డోన్, రుద్రవరం మండలాల్లో పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే ప్రతి మండలంలో చేపట్టిన ఉత్తమ జల సంరక్షణ కార్యక్రమాన్ని కేస్ స్టడీ లేదా సక్సెస్ స్టోరీ రూపంలో సిద్ధం చేసి అందించాలని వాటర్ రిసోర్స్ ఇంజనీర్లకు సూచించారు. ఇటీవల ముఖ్యమంత్రితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో నంద్యాల జిల్లాలో అమలవుతున్న జలధార కార్యక్రమాన్ని అభినందించిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గత నవంబర్లో 3.5 మీటర్లుగా ఉన్న నీటిమట్టాన్ని ఈ ఏడాది నవంబర్ నాటికి కనీసం ఒక మీటరు మేర మెరుగుపరిచే లక్ష్యంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# ధర్మవరానికి టర్ఫ్ హాకీ కోర్టు

## రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ ముగింపు వేడుకల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ









**శ్రీ సత్య సాయి ప్రతినిధి, జూన్ 15,(రిపబ్లిక్ న్యూస్):**
ధర్మవరాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని, త్వరలోనే ఆధునిక టర్ఫ్ హాకీ కోర్టును ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్లో ధర్మాంబా అసోసియేషన్ 75వ వసంతాల వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ 16వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి సత్తి కుమార్ పాల్గొన్నారు.

**యువత చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందిస్తాయని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ధర్మాంబా అసోసియేషన్ 75 ఏళ్లుగా హాకీ క్రీడాభివృద్ధికి చేస్తున్న సేవలు ప్రశంస నీయమని కొనియాడారు. రాష్ట్రస్థాయి పోటీలు గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయడంలో కీలకంగా నిలుస్తాయని అన్నారు. టోర్నమెంట్ చివరి రోజు జరిగిన ఉత్కంఠభరిత పోటీల్లో అనకాపల్లి, అన్నమయ్య జిల్లాల జట్లు సంయుక్త విజేతలుగా నిలవగా, అనంతపురం జిల్లా జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. ప్రతిభా పురస్కారాల్లో అన్నమయ్య జిల్లా క్రీడాకారుడు హితేష్, సత్యసాయి జిల్లా రఫీ, అనకాపల్లి జిల్లా హర్ష కమల్ "బెస్ట్ ప్లేయర్స్ ఆఫ్ ది టోర్నమెంట్" అవార్డులను అందుకున్నారు. విజేతలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, ఉపాధ్యక్షులు సూర్యప్రకాశ్, గౌరీప్రసాద్, ఉడుముల రామచంద్ర, ట్రెజరర్ అంజన్న, జాయింట్ సెక్రటరీ అరవింద్ గౌడ్, జెన్నే చంద్రశేఖర్, మారుతి, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 24 గంటలలో కానాలపల్లె దొంగతనం కేసు ఛేదింపు

## ఐదుగురు నిందితుల అరెస్ట్... చోరీ సొత్తు స్వాధీనం



**నంద్యాల క్రైం, జూన్ 15, (రిపబ్లిక్ న్యూస్):**
గోస్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కానాలపల్లె గ్రామంలో జరిగిన దొంగతనం కేసును 24 గంటలలో పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి చోరీకి గురైన బంగారు గొలుసుతో పాటు దొంగతనానికి ఉపయోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు గోస్పాడు సబ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14.06.2026 రాత్రి కానాలపల్లె గ్రామానికి చెందిన మిదుతూరి లక్ష్మీదేవి అనే మహిళ తన ఇంటికి తాళం వేసి నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లోని పెట్టెలో భద్రపరిచిన బంగారు గొలుసును దుండగులు అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గోస్పాడు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, సబ్ ఇన్స్పెక్టర్ పి. సుధాకర్ రెడ్డి దర్యాప్తు ప్రారంభించారు.

**నిందితుల అరెస్ట్, రికవరీ**

దర్యాప్తులో భాగంగా సోమవారం సాంబవరం మెట్ట వద్ద ఉన్న కాశిరెడ్డి నాయన ఆశ్రమం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో తామే ఈ దొంగతనానికి పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు.

**స్వాధీనం చేసుకున్న సొత్తు**

బంగారు గొలుసు: తూకం 20.700 గ్రాములు

**ఒక ఆటో, ఒక బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్**

నిందితులను అరెస్ట్ చేసిన అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం తరలించి, తదుపరి చట్టపరమైన చర్యల కోసం గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచడం జరిగిందని ఎస్ఐ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. కేసును వేగంగా ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదు

## ఇద్దరు వ్యక్తులకు ఒక్కొక్కరికి 3 రోజులు జైలు, రూ.1000 జరిమాన




**నంద్యాల క్రైం, జూన్ 15, (రిపబ్లిక్ న్యూస్):** మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవని ఆళ్లగడ్డ కోర్టు తీర్పు ద్వారా స్పష్టమైంది. చాగలమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరు యువకులకు కోర్టు మూడు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు చెరో వెయ్యి రూపాయల జరిమానా విధించింది. చాగలమర్రి సబ్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో నాగలపాడు గ్రామానికి చెందిన మూరబోయిన మధు, బట్టు వెంకటేష్ అనే ఇద్దరు యువకులు అతిగా మద్యం సేవించి మత్తులో మోటారు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు వారికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా, వారు పరిమితికి మించి మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. దీనిపై చాగలమర్రి ఎస్సై కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం నిందితులను సోమవారం ఆళ్లగడ్డ స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. నిందితులపై మోపబడిన నేరం రుజువు కావడంతో, గౌరవ న్యాయమూర్తి రవికుమార్ ఇద్దరు నిందితులకు చెరో రూ. 1,000/- జరిమాన, 3 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

**పోలీసుల హెచ్చరిక**

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేసినట్లవుతుందని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని, మద్యం మత్తులో వాహనాలు నడిపితే భవిష్యత్తులోనూ ఇలాంటి కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

# 119 ఫిర్యాదుల స్వీకరణ.. చట్టపరంగా విచారణ చేసి న్యాయం చేస్తాం: ఎస్పీ విక్రాంత్ పాటిల్

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితుల సమస్యలపై వినతి స్వీకరణ అధికారులకు త్వరిత పరిష్కారాల ఆదేశాలు**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 15)**
జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని కర్నూలు జిల్లా పోలీసు అధికారి విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ హామీ ఇచ్చారు.

కర్నూలు కొత్తపేటలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో మొత్తం 119 ఫిర్యాదులు అందాయి. ఉద్యోగాల పేరుతో మోసాలు, భూ ఆక్రమణలు, కుటుంబ ఆస్తి వివాదాలు, ఆర్థిక మోసాలు, ప్లాట్ల విక్రయాల పేరుతో మోసపూరిత చర్యలు తదితర అంశాలపై బాధితులు ఫిర్యాదులు సమర్పించారు. గోనెగండ్ల మండలానికి చెందిన మహబూబాషా, ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసిస్ట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ. 3.85 లక్షలు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. తుగ్గలి మండలం ఎద్దులదొడ్డి గ్రామానికి చెందిన రంగమ్మ తన 2.40 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని న్యాయం కోరారు. కోడుమూరు మండలం లద్దగిరికి చెందిన రాముడు కుమారులు ఆస్తి కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

అలాగే కర్నూలు చల్లా స్ట్రీట్‌కు చెందిన మహిళ బంగారం తీసుకుని తిరిగి ఇవ్వడం లేదని, కోసిగి మండలం కోల్మానుపేటకు చెందిన బసప్ప తన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఎమ్మిగనూరుకు చెందిన వీరేష్ బాబు ప్లాట్ల విక్రయం పేరుతో రూ. 30 లక్షలు మోసపోయినట్లు, పెద్దకడుబూరుకు చెందిన ఉషారాణి తనకు రావాల్సిన కుటుంబ ఆస్తి ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారుల ద్వారా త్వరితగతిన విచారించి చట్టబద్ధంగా పరిష్కరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రజలకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు చూపాలి

**పీజీఆర్ఎస్ అర్జీలపై మరింత బాధ్యతతో వ్యవహరించాలి 15 రోజుల్లో కారుణ్య నియామకాల పెండింగ్ కేసులు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 15)**
ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించిన కలెక్టర్, వాటి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం యొక్క ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పరిష్కరించాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని, పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించడం సాధ్యం కాని పరిస్థితుల్లో అందుకు గల కారణాలను పూర్తిగా వివరించడంతో పాటు, తీసుకోబోయే చర్యలపై కూడా అర్జీదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న "రీ ఓపెన్" మరియు "ఇంప్రాపర్ రెడ్రెసల్" కేసుల సంఖ్యను పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపించాలని పేర్కొన్నారు.


జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని కేసులను 15 రోజుల్లోగా పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా పారదర్శకంగా, సమయపాలనతో వ్యవహరించాలని సూచించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అన్ని శాఖలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇంకా వెనుకబడిన శాఖలు ప్రత్యేక దృష్టి సారించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామసుబ్బయ్య, శివప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జూన్ 24న జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

**జొన్నగిరి జియో మైసూర్ గోల్డ్ మైన్స్ పరిశీలన పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 15)**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24న కర్నూలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరిలో ఉన్న జియో మైసూర్ గోల్డ్ మైన్స్ కంపెనీని ముఖ్యమంత్రి సందర్శించి పరిశీలించనున్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా జొన్నగిరికి చేరుకుని గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను పరిశీలించిన అనంతరం సమీపంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. హెలిపాడ్ వద్ద నుంచి తిరిగి విజయవాడకు బయలుదేరే వరకు ఎలాంటి లోపాలు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. హెలిపాడ్, బహిరంగ సభా వేదిక, బారికేడింగ్, రహదారుల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కోసం మూడు ప్రాంతాల్లో అంబులెన్సులు సిద్ధంగా ఉంచడంతో పాటు లైవ్ బ్లడ్ డోనర్లు, కార్డియో, న్యూరో స్పెషలిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్ నమోదు కౌంటర్ ఏర్పాటు చేయాలని, వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే స్టాళ్లను ఏర్పాటు చేయాలని కూడా ఆదేశించారు.

జలధారజలహారతి, డీఆర్‌డీఏ, వ్యవసాయం, ఉద్యానవనం, స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర, ఆర్అండ్‌బీ తదితర శాఖలకు సంబంధించిన ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రజలకు సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈవో వెంకటరమణారెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రెండేళ్ల అభివృద్ధి సంక్షేమ ప్రగతికి అద్దం పట్టిన శాఖల స్టాళ్లు

**ప్రదర్శనలను సందర్శించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచన**










**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 15)**
రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖల ప్రదర్శన స్టాళ్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి కూడా మంత్రితో కలిసి స్టాళ్లను పరిశీలించారు.

వ్యవసాయ శాఖ, పాఠశాల విద్యా శాఖ, దీపం-2, మెప్మా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, డీఆర్‌డీఏ, ఆర్ అండ్ బి శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుంతల పూడ్చివేత కార్యక్రమాల స్టాళ్లను మంత్రి పరిశీలించారు. ఆయా శాఖల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, గత రెండేళ్లలో సాధించిన ప్రగతి, అమలవుతున్న సంక్షేమ పథకాల వివరాలను జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గత రెండేళ్లుగా జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమపాళ్లలో ముందుకు తీసుకెళు తున్నామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.

## వాటర్ ట్యాంక్ నిర్మించిన వైఎస్సార్‌సీపీ మహిళా నేత హేమలత



**అనంతపురం/ గుత్తి జూన్ 15 (రిపబ్లిక్ న్యూస్)**
అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని 14వ వార్డులో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు హేమలత సొంత ఖర్చులతో 1000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. వార్డులోని సుంకులమ్మ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా ఈ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తించి తమ వంతు బాధ్యతగా ఈ వాటర్ ట్యాంక్‌ను నిర్మించినట్లు తెలిపారు. తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించడమే తన లక్ష్యమని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని పేర్కొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణంతో 14వ వార్డు ప్రజలకు తాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## విద్యుత్ ఘాతంతో రైతు మృతి



**మహానంది జూన్ 15 (రిపబ్లిక్ న్యూస్):-**
మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బోడెద్దుల శివుడు (50) అనే రైతు ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో మృతి చెందారు. సోమవారం రైతులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..తిమ్మాపురం గ్రామ సమీపంలోని పంట పొలంకు వెళ్లగా ప్రమాదవశాత్తు తెగిపడిన విద్యుత్ తగిలి అపస్మారక స్థితికి వెళ్లారన్నారు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఓర్వకల్లు మండల రైతులను నట్టేట ముంచుతున్న మెగా కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**రైతులకు తెలియకుండా వారి అనుమతి లేకుండా పోలీసులను అడ్డం పెట్టుకొని**
**మెగా కంపెనీ వారు పనులు పూర్తి చేయడం అన్యాయం**





**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 15(రిపబ్లిక్ న్యూస్)**కలెక్టర్ జోక్యం చేసుకొని రైతులకు అన్యాయం చేసిన మెగా కంపెనీ వారిపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలిఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న డిమాండ్ చేశారుసోమవారం రోజు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం తిప్పాయపల్లె శకునాల కాల్వ గ్రామాల రైతుల అనుమతి లేకుండా పోలీసులను అడ్డం పెట్టుకుని హై పవర్ వైర్ల పనులను పూర్తి చేసిన వారిపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వాసితుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డాక్టర్, సిరికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్ మధుసూదన్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రామకృష్ణ బాధిత రైతులు సుంకి రెడ్డి సుఖేందర్ రెడ్డి హరినాథ్ రెడ్డి సుధాకర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిప్పాయపల్లె శకునాల కాలువ గ్రామ పొలిమేరలో మెగా కంపెనీవారు భారీ విద్యుత్ స్తంభాలు హై పవర్ వైర్లను రైతుల పొలాలలో వారి అనుమతి లేకుండా నష్టపరిహారం చెల్లించకుండా పోలీసులను అడ్డం పెట్టుకొని రైతులను అరెస్టు చేసి బలవంతంగా హై పవర్ వైర్లను లాగడం బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పేరుతో రైతుల భూములను యదేచ్ఛగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని రైతులు ఎంత మొరపెట్టుకున్నా ఏ అధికారి కనికరించడం లేదని దీనివల్ల మండలంలోని రైతులు అనేక పరిశ్రమల వల్ల తీవ్రమైన ఆందోళన చెందుతున్నారని అన్నారు ఏ పరిశ్రమ కైనా రైతుల భూములు తీసుకుంటే రైతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే ప్రాజెక్టును గాని పరిశ్రమలు గాని ప్రారంభించాలని చట్టంలో ఉన్నా అవేవీ పట్టించుకోకుండా రైతుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు రైతుల పొలాలలో భారీ విద్యుత్ స్తంభాలు హై పవర్ వైర్లు పోవడం వల్ల 80 లక్షలు విలువ ఉన్న భూములు ఐదు పది లక్షల కంటే ఎక్కువ విలువకు పడిపోయిందని ఈ చుట్టుపక్కల సోలార్ కోకా కోల కంపెనీలు వచ్చాయని దీనివల్ల రైతులు మంచి రేటు పలుకుతుందని ఆశించారని అయితే మెగా కంపెనీ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు ఇప్పటికైనా కర్నూలుజిల్లా కలెక్టర్ రైతుల పట్ల సానుకూలంగా స్పందించి హై పవర్ వైర్లను రైతుల అనుమతి లేకుండా లాగిన మెగా కంపెనీ పై చర్యలు తీసుకుని రైతులకు మీటరుకు 8 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి జయచంద్రారెడ్డి సుంకన్న అక్బర్ బాషా వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## తాలూకా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ

**ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**

**బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులకు ఆదేశం**





**నంద్యాల క్రైం, జూన్ 15, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సోమవారం జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ అక్కడ పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన బాధితులతో ఎస్పీ స్వయంగా మాట్లాడారు. వారి సమస్యలను, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది, ఫిర్యాదులపై స్పందన ఎలా ఉందనే విషయాలపై స్పష్టత తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ "పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడికి తక్షణమే స్పందించి న్యాయం చేయడమే మా ప్రథమ ప్రాధాన్యత. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలి. బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం, కేసుల పురోగతిపై స్టేషన్ అధికారులతో ఎస్పీ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి, బాధితులకు తగిన న్యాయం జరిగేలా చూడాలని అక్కడి అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

# రూ.2.70 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు

**మెదక్ పట్టణ రూపురేఖలు మార్చే దిశగా భారీ అభివృద్ధి కార్యక్రమాలు -ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం**







**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 15 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

మెదక్ పట్టణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో మొత్తం రూ.2 కోట్ల 70 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ఘనంగా నిర్వహించబడ్డాయి.

ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, సీసీ డ్రెయిన్లు, స్లాబులు, తాగునీటి సదుపాయాల కల్పన వంటి కీలక పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ప్రతి కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, "మెదక్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాను. అభివృద్ధి ఫలాలు ప్రతి వార్డుకు, ప్రతి కుటుంబానికి చేరేలా నిరంతరం పనిచేస్తున్నాను" అని తెలిపారు.

**ప్రతి వార్డులో అభివృద్ధి జోరు సీసీ రోడ్లు, డ్రెయిన్లు, స్లాబులతో మౌలిక వసతుల బలోపేతం**

మొదటగా 10వ వార్డులో ఎండి అత్తర్ షరీఫ్ నుండి జియావుద్దీన్, తిరుపతి ఇంటి వరకు అలాగే బస్తీ దవాఖానా నుండి గౌడ నాగులు, బండి నర్సింలు ఇంటి వరకు రూ.21 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రోడ్లు ఒక ప్రాంత అభివృద్ధికి అద్దం పడతాయి. ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా నాణ్యమైన రోడ్లు నిర్మిస్తున్నాం" అని పేర్కొన్నారు.

అనంతరం 27వ వార్డులో రూ.35 లక్షల వ్యయంతో వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "పట్టణంలోని ఏ వార్డూ అభివృద్ధికి దూరంగా ఉండకూడదు. ప్రతి కాలనీకి సమాన ప్రాధాన్యత ఇస్తున్నాం" అన్నారు.

11వ వార్డులోని సాయినగర్ కాలనీ, వెంకట్రావు నగర్ కాలనీ, రషీద్ కాలనీలలో రూ.52 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు, స్లాబులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం కోసం ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని ప్రణాళికలు రూపొందిస్తున్నాం" అన్నారు.

**వార్డు 13లో రూ.1.06 కోట్ల భారీ పనులు మెదక్ అభివృద్ధి చరిత్రలో మరో మైలురాయి**

పట్టణంలోని 13వ వార్డు, నల్లపోచమ్మ కాలనీ, మీరా కాలనీలలో రూ.1 కోటి 6 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు, స్లాబులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, "ఎన్నో సంవత్సరాలుగా మౌలిక వసతుల కోసం ఎదురుచూస్తున్న ప్రాంతాలకు ఇప్పుడు అభివృద్ధి చేరుతోంది. ప్రజల అవసరాలే మా ప్రభుత్వ ప్రాధాన్యత. ఈ పనులు పూర్తయిన తర్వాత ఈ ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి" అని అన్నారు.

అదేవిధంగా 14వ వార్డులో శ్రీ గట్టమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో రూ.9 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు.

అలాగే 24వ వార్డులో రూ.30 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు, స్లాబులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనచేశారు.

15వ వార్డులో ఖైరత్ అలీ ఇంటి నుండి ఖైసర్ పాషా ఇంటి వరకు, హైదర్ ఇంటి నుండి రజక సంఘం వరకు, రహమత్ ఇంటి నుండి రామవ్వ ఇంటి వరకు వివిధ ప్రాంతాల్లో రూ.17.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజలు నన్ను ఎన్నుకున్నది అభివృద్ధి కోసం. అందుకే ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నాం. పట్టణంలోని ప్రతి బస్తీ, ప్రతి కాలనీ అభివృద్ధి చెందే వరకు మా కృషి ఆగదు" అని స్పష్టం చేశారు.

**తాగునీటి సమస్యకు చెక్**

**ఎం ఎస్ ఎస్ ఓ ఆధ్వర్యంలో 3 బోరు మోటార్ల ప్రారంభం**

పట్టణంలోని 3వ వార్డులో ఎం ఎస్ ఎస్ ఓ (మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు తాగునీటి బోరు మోటార్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం మా బాధ్యత. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు కనీస అవసరాలు అందేలా నిరంతరం కృషి చేస్తాం" అని తెలిపారు.ప్రజలతో మమేకమవుతూ ప్రతి సమస్యను స్వయంగా తెలుసుకుంటూ పరిష్కార మార్గాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మెదక్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి పట్టణం మరియు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# వనాలు.. పర్యావరణ పరిరక్షణకు వరాలు

**-మొక్కలు నాటడం సామాజిక బాధ్యత - మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**

**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 15 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

వనాలు పర్యావరణ పరిరక్షణకు వరాలు అని మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకొని ఈనెల 18వ తారీఖు నుండి వన మహోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించాలనిరామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో నగర్ వన్ యోజన పార్కులో ఈనెల 18న వన మహోత్సవ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు వివరించారు

, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ఆస్తి పన్ను వసూలలో కలెక్టరేట్ కార్యాలయ నిర్వహణ కమిటీల ద్వారా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్ అధికారులను ఆదేశించారు .

సోమవారం ప్రజావాణి అనంతరం వివిధ శాఖల అధికారులతో వనమహోత్సవ కార్యక్రమం, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఆస్తి పన్ను వసూలు , ప్రభుత్వ కార్యాలయాల పరిశుభ్రత సంబంధిత విషయాల పై అదనపు కలెక్టర్ నగేష్ , డీఎఫ్ఓ జో.జి డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల




కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులందరూ తమ భాగస్వామ్యం ద్వారా విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించడానికి, పచ్చదనాన్ని పెంపొందించడానికి వన మహోత్సవం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని

ఈనెల 18 నుండి వన మహోత్సవ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వక్చువల్ గా ప్రారంభిస్తున్న నేపథ్యంలో మన జిల్లాలో కూడా ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నామన్నారు. అటవీ శాఖ,జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మున్సిపల్ శాఖ, వివిధ సంక్షేమ శాఖలు వ్యవసాయ, విద్యా, తదితర శాఖల ఆధ్వర్యంలో మొత్తం 31.95 లక్షల మొక్కలను నాటేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

వన మహోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని పరిరక్షించాలని లికలెక్టర్‌లి పిలుపునిచ్చారు. జిల్లాను మరింత పచ్చదనంతో నింపేందుకు అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ శాఖల వారీగా రివ్యూ చేస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

ఆస్తి పన్ను వసూలలో భాగంగా కలెక్టరేట్ నిర్వహణ కమిటీల ద్వారా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత డిఆర్ఓ ను ఆదేశించారు. కలెక్టరేట్ లోని వివిధ విభాగాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారాలని కార్యాలయాలు కలెక్టర్ ఆకస్మిక పర్యటనలలో అపరిశుభ్రంగా ఉన్న కార్యాలయాల అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# అల్మాయిపేట్‌లో ఘనంగా "చాయ్ చస్కా" హోటల్ ప్రారంభం







**అందోల్ ప్రతినిధి జూన్ 15( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

అందోల్ మండలంలోని అల్మాయిపేట్ గ్రామ సమీపంలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్-161) ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన "చాయ్ చస్కా" హోటల్ ఘనంగా ప్రారంభమైంది. ఆధునిక సౌకర్యాలతో, కుటుంబ సమేతంగా భోజనం చేయడానికి అనువైన వాతావరణంలో ఈ హోటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.హోటల్‌లో టీ, కాఫీతో పాటు వివిధ రకాల అల్పాహారాలు, వెజ్ మరియు నాన్‌వెజ్ వంటకాలు, బిర్యానీలు, ప్రత్యేక ఫుడ్ ఐటమ్స్ వినియోగదారులకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఐ అనిల్ కుమార్,మున్సిపల్ చైర్మన్ సోమిరెడ్డి కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు )కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురోత్తం రెడ్డి, కౌన్సిలర్లు,కో ఆప్షన్ మెంబర్స్ జీషాన్, అక్బర్ కాంగ్రెస్ నాయకులు స్థానిక అల్మాయిపేట్ సర్పంచ్ దుర్గ ప్రసాద్ బి ఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ నాగరత్నం గౌడ్. బి ఆర్ ఎస్ నాయకులు విజయ్ పింటూ. చౌటకుర్ సర్పంచ్ పార్కల రామ్ రెడ్డి ప్రజలు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అల్మాయిపేట్ ప్రాంతంలో కొత్త ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన ఆహార సదుపాయాలు అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.





# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం

## జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 15 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 82 దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. సమస్యలు పరుష్కారం కోరుతూ ప్రజలు అందచేసిన దరఖాస్తులు జాప్యం చేయకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తి గతంగా పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. వచ్చే సోమవారం వరకు వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కరించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కారం పట్ల పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా, దరఖాస్తులు అన్ని శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకుని, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరిష్కారంలో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# త్రిబుల్ ఐటీ సీటు సాధించిన విద్యార్థినిలకు ఘన సన్మానం

**మల్లాపూర్ జూన్ 15 ( రిపబ్లిక్ న్యూస్ )**




మల్లాపూర్ మండలం రేగుంట గ్రామానికి చెందిన బొమ్మెన లాస్యశ్రీ, మూడంపల్లి హర్షిణి. బాసర త్రిపుల్ ఐటీ లో మరియు మరిపల్లి సహస్ర మహాబూబ్ నగర్ త్రిబుల్ ఐటీ లో సీటు సాధించారు. అలాగే బొల్లారపు కృత్తిక సాక్షి NMMS స్కాలర్‌షిప్ సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందిస్తూ రేగుంట గ్రామ సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ రేగుంట ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యధిక మార్కులు తెచ్చుకుని బాసర త్రిబుల్ ఐటీ లో సీటు సాధించడం గ్రామ ప్రజలకు గర్వకారణమని, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారికి మాత్రమే ఇలాంటి అవకాశాలు వస్తుంటాయని, భవిష్యత్తులో పట్టుదలతో చదివి ఉన్నతమైన స్థానానికి చేరుకోని గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వినీత, పాలకవర్గ సభ్యులు కలసాని రాజన్న, మహమ్మద్ బషీర్, బాస రాజరెడ్డి, బొల్లారపు పుష్ప. జి.పి.ఒ రాములు, కారోబార్ సుధాకర్, హైస్కూల్ హెడ్ మాస్టర్ రాజు, ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ శంకర్ మరియు ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# నటరాజ కళా తోరణం విద్యార్థుల చక్కటి ప్రదర్శన





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 15 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

మెదక్ జిల్లాలోని అయ్యప్ప దేవాలయం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించినటువంటి కార్యక్రమంలో నటరాజ కళాతోరణం విద్యార్థులు చక్కటి ప్రదర్శన ప్రదర్శించారు అక్కడికి విచ్చేసిన భక్తులు మరియు అయ్యప్ప దేవాలయం మెంబర్స్ అందరూ కలిసి విద్యార్థులను మరియు గురువుగారు అయినటువంటి శివాని గారిని అభినందించడం జరిగిందిద

# తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆత్మీయ సమ్మేళనం. ముఖ్య అతిథి రాష్ట్ర అధ్యక్షుడు తనుగుల జితేందర్ రావు.



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 15 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

సంగారెడ్డిలో జరిగిన టీ వై జె ఎఫ్, తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆత్మీయ సమ్మేళనం సమావేశానికి వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు తనుగుల జితేందర్రావు మా పత్రిక విలేకరులకు యూనియన్ ఐడి కార్డ్స్, హెల్త్ కార్డు పంపిణీ చేసిన సందర్భంగా, ఆత్మీయంగా కలిసినా సాక్షి డిజిటల్ న్యూస్ (ప్రతినిధి జెల్ల భాగయ్య)

# అందోల్ మండల్ పోతిరెడ్డిపల్లి గ్రామం లో మద్యపానం నిషేధం



**ఆందోల్ ప్రతినిధి జూన్ 15 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**


అందోల్ మండల్ పోతిరెడ్డిపల్లి గ్రామంలో గత కొంతకాలంగా (బెల్టు షాపులు మద్యం) విచ్చలవిడిగా అమ్మడం జరుగుతోంది. దాంతో స్కూల్ పక్కనే స్కూల్ పక్కనే షాపులు ఉండడం వలన మద్యం తాగి న్యూసెన్స్ చేయడం వలన స్కూల్ పిల్లలకు అలాగే గ్రామస్తులకు చాలా ఇబ్బందికరంగా ఉంది అని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు ఈ విషయంపై ఈ విషయంపై గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి వెంటనే స్పందించి వార్డ్ మెంబర్ తో చర్చించి గ్రామ పెద్దలతో సలహా తీసుకోవడం జరిగింది మద్యం విషయంపై గ్రామ సభలో కూడా చర్చించడం జరిగింది దాంతో గ్రామస్తులు కూడా ఆమోదించడం జరిగింది ఇట్టి విషయంపై గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి ఉప సర్పంచ్ మరియువార్డ్ మెంబర్లు కలిసి పోతిరెడ్డిపల్లి గ్రామంలో మద్యపానం నిషేధంపై వినతి పత్రం ఎస్సై పాండు గారికి అందజేయడం జరిగింది

# జూన్ 17న టెక్కె మార్కెట్ యార్డులో “రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం“ భారీ కార్యక్రమం

**జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి**

**సంక్షేమ ఫలితాలను ప్రతిబింబించేలా స్టాళ్లు ఏర్పాటు చేయాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, జూన్ 15( రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న “రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమాల విజయవంత నిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో “రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమంపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఈ నెల 17న టెక్కె మార్కెట్ యార్డులో “రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం“ జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 5 వేల మంది




పాల్గొననున్నారని, వర్షాభావాన్ని దృష్టిలో ఉంచుకొని జర్మన్ హ్యాంగర్ పందిళ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న స్టాళ్లు ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను ప్రతిబింబించేలా ఉండాలని కలెక్టర్ సూచించారు. మొత్తం 19 శాఖల స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్టీసీ, డీఆర్‌డీఏ, వ్యవసాయం, మెప్మా, పశుసంవర్ధక శాఖ, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్, టూరిజం, ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్, పోలీసు శాఖ, మత్స్యశాఖ తదితర విభాగాలు తమ శాఖల విజయాలను ప్రజలకు వివరించేలా ప్రదర్శనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీపీఓ ఆధ్వర్యంలో పీ4 కాన్సెప్ట్‌కు సంబంధించిన ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సహకార శాఖ ఆధ్వర్యంలో పీఏసీఎస్‌ల ద్వారా పెట్రోల్ బంకులు, జనఔషధి కేంద్రాలు, బియ్యం విక్రయాలు, తేనె, బెల్లం ఉత్పత్తుల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న విధానాన్ని ప్రదర్శించాలని సూచించారు. జలధార కార్యక్రమం కింద  కాస్కేడ్ నంబర్–26 పరిధిలో నాలుగు చెరువులను అనుసంధానం చేస్తూ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు రాష్ట్రస్థాయిలో ప్రశంసలు పొందాయని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని శాఖలు 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వం ఏర్పడిన తరువాత చేపట్టిన ముఖ్య కార్యక్రమాలు, ఖర్చులు, లబ్ధిదారుల వివరాలను వెంటనే సీపీఓ కార్యాలయానికి సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పల్లె పండుగ, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం, డొక్కా సీతమ్మ, సర్వేపల్లి రాధాకృష్ణ మిత్ర, పింఛన్లు, స్త్రీ శక్తి, డీఆర్‌డీఏ జీవనోపాధి కార్యక్రమాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, సర్క్యులర్ ఎకానమీ ప్రాజెక్టులు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను సంక్షిప్తంగా నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఆర్.టీ.ఈ విద్యాహక్కు చట్టం ను సమగ్రంగా అమలు చేయాలి -యు.ఎస్.ఎఫ్.ఐ

**ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి**

**నారాయణ ,శ్రీ చైతన్య, భాష్యం కార్పోరేట్ శక్తుల ఫీజుల దోపిడీ పై చర్యలు తీసుకోవాలి**

**నంద్యాల, జూన్ 15, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా విద్యాహక్కు చట్టం 2009 ను సమగ్రంగా అమలు చేయాలని చట్టం ప్రకారం 25% ఉచిత సీట్లల ద్వారా చదువుతున్న విద్యార్థుల నుంచి ప్రవేటు పాఠశాలలు  అధిక ఫీజులు వసూలు చేయటాన్ని ఖండిస్తూ యు.ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర ఉపాధక్షులు నరసింహ రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం ను ఉద్దేశించి వారు



మాట్లాడుతూ 25% ఉచిత సీట్లకు గాను రాష్ట్ర సమగ్ర శిక్ష నుంచి అన్ని ప్రైవేటు పాఠశాలలకు బకాయిలు ఉన్న నిధులను విడుదల చేసిన ప్రవేట్ పాఠశాలలు తల్లిదండ్రులపై అధిక భారాలు మోపుతూ  ప్రైవేటు పాఠశాలలు ఫీజులు వసూలు చేసిన వారి పై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమైన చర్య అని తక్షణమే ఈ ఫీజులు వసూలు చేస్తున్న  ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులకు ఉచిత సీట్లపై అవగాహన కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు పత్రికా ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఫీజు నియంత్రణ చట్టం చేయాలని నారాయణ శ్రీ చైతన్య భాష్యం, ఇతర కార్పోరేట్ శక్తులు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రెనివల్ ,పుస్తకాల పేరుతో, యూనిఫాంలో పేరుతో అనధికారికంగా అధిక భారాలు మోపుతూ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇది విద్యాశాఖ అధికారులకు బహిర్గతంగా తెలిసిన ఈ పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటని తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా విద్యాహక్కు చట్టం 2009ను అమలు చేయాలని రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని భారత ఐక్య విద్యార్థి సమాఖ్య గా డిమాండ్ చేస్తున్నాము.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**జడ్పీ జనరల్ బాడీలో లేవనెత్తిన ప్రజా సమస్యలపై శాఖల వారీ సమీక్షలు**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**నంద్యాల బ్యూరో, జూన్ 15( రిపబ్లిక్ న్యూస్):** ఉద్యోగ సంఘాలు, జడ్పీ జనరల్ బాడీ సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం, జడ్పీ జనరల్ బాడీ సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలపై జిల్లా



అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 30 గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలు ఉండగా, నంద్యాల జిల్లాలో 15 ఉద్యోగ సంఘాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు 126 సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఉద్యోగుల నుంచి ప్రధానంగా సెలవుల మంజూరు, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల మంజూరులో జాప్యం, కారుణ్య నియామకాల ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లలో కోతలు, చిన్నచిన్న సెలవులకైనా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్న అంశాలను తన దృష్టికి తీసుకువచ్చారని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, మిగిలిన అంశాలను సమావేశ మినిట్స్ రూపంలో రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. జూన్ 17 తర్వాత జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సమీక్ష చేపడతామని కలెక్టర్ తెలిపారు. జడ్పీ జనరల్ బాడీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన ప్రజా సమస్యలపై శాఖల వారీ సమీక్షలు నిర్వహిస్తానని కలెక్టర్ తెలిపారు. దొర్నిపాడు మండల పరిధిలోని పాఠశాలలో ఓవర్ హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్ శిథిలావస్థకు చేరి విద్యార్థులకు ప్రమాదకరంగా మారిన విషయం, కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో పాఠశాల అప్‌గ్రేడ్ అయినప్పటికీ విద్యార్థులు చెట్ల కింద చదువుకుంటున్న పరిస్థితిని సంబంధిత అధికారులు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. బ్రాహ్మణకొట్కూరు ప్రాంతంలో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ హెచ్చుతగ్గుల సమస్యను పరిష్కరించాలని ఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో ఆర్టీఎస్ఎస్ పథకం అమలు, గడివేముల ప్రాంతంలో త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా, సోమాపురం గ్రామంలో ఇళ్లపైకి వాలుతున్న విద్యుత్ తీగలు, బీసీ వెల్ఫేర్ పాఠశాలలకు సోలార్ గీజర్ల ఏర్పాటు వంటి అంశాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారి 167కే, 340సీ పనుల సందర్భంగా అనుమతులు లేకుండా మట్టి తరలింపు, పైప్‌లైన్ల ధ్వంసం, బ్రాహ్మణకొట్కూరు సమీపంలో రైతుల వ్యవసాయ భూములకు వెళ్లే దారులు మూసుకుపోవడం వంటి సమస్యలకు పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఆత్మకూరు కురుకుంద, బైరప్ప చెరువులకు సంబంధించిన నీటి విడుదల అంశాలపై వచ్చిన ఫిర్యాదులను కూడా పరిశీలించాలన్నారు. అలాగే ఎస్సీ కమిషన్‌కు సంబంధించిన పెండింగ్ పిటిషన్లు, కొత్తగా వచ్చిన వినతులు సహా అన్ని అంశాలపై శాఖల వారీగా ప్రత్యేక సమీక్షలు నిర్వహించి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేస్తామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

**రూ.4 కోట్ల విలువైన సహాయక పరికరాల పంపిణీ**

**ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





**నంద్యాల బ్యూరో, జూన్ 15 (రిపబ్లిక్ న్యూస్):** సమాజంలోని విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులు స్వయం సమృద్ధితో జీవించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డులో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ఏడీఐపీ  పథకం కింద దివ్యాంగులకు సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరితో కలిసి కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్, వృద్ధులకు చేతికర్రలు తదితర సహాయక పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే సుమారు 5 వేల దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి వివిధ సహాయక పరికరాల మంజూరుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి అర్హులైన ప్రతి ఒక్కరూ వాటి ప్రయోజనాలను పొందాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలు తమ పరిసరాల్లోని అర్హులకు చేరవేసి వారికి తోడ్పడాలని కోరారు. దివ్యాంగుల పెన్షన్ల పెంపు అంశంపై స్పందిస్తూ, 90 శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగి పూర్తిగా ఇతరులపై ఆధారపడే వ్యక్తులకు ప్రత్యేక నిబంధనల మేరకు అధిక పెన్షన్ అందజేస్తున్నట్లు వివరించారు. అర్హుల వివరాలను వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.16 కోట్ల నిధులు కేటాయించిందని, మరింత మంది లబ్ధిదారులకు మద్దతు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో 24,679 మంది దివ్యాంగులకు ప్రతి నెలా రూ.15.26 కోట్ల మేర పెన్షన్లు అందుతున్నాయని, అదనంగా డయాలసిస్ మరియు మంచానికే పరిమితమైన పక్షవాతం బాధితులకు ప్రత్యేకంగా రూ.1.53 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. దివ్యాంగులకు సామాజిక భద్రతతో పాటు రవాణా సౌకర్యాలను కూడా ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. మహిళల కోసం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం తరహాలోనే దివ్యాంగ శక్తి కార్యక్రమం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలి. జిల్లాలో ఇప్పటివరకు 1.42 లక్షల మంది దివ్యాంగులు ఈ సేవలను వినియోగించుకుని రూ.58.64 లక్షల విలువైన ప్రయాణ సౌకర్యం పొందినట్లు వెల్లడించారు. హౌసింగ్ ఫర్ ఆల్ పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల కోసం స్వర్ణగ్రామ్, స్వర్ణవార్డ్ కార్యాలయాల్లో మాత్రమే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని, సాధారణ వినతిపత్రాలు సమర్పించడం ద్వారా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తులను రెవెన్యూ అధికారులు, సంబంధిత విభాగాలు పరిశీలించిన అనంతరం తుది అనుమతులు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలీంకో సంస్థ కీలక పాత్ర పోషించిందని కలెక్టర్ కొనియాడారు. గత మూడు వారాలుగా సంస్థకు చెందిన సిబ్బంది జిల్లాలోనే ఉండి లబ్ధిదారుల అవసరాలకు అనుగుణంగా పరికరాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. అలీంకో ద్వారా గుర్తించిన 1,847 మంది దివ్యాంగులకు దాదాపు రూ.4 కోట్ల విలువైన సహాయక పరికరాలను అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విభిన్న ప్రతిభావంతులలో ఉన్న ఆత్మవిశ్వాసం, పట్టుదల సమాజానికి ఆదర్శమని, వారి ఎదుగుదలకు నిరంతరం కృషి చేస్తున్న తల్లిదండ్రులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తగిన స్థలం గుర్తించి త్వరలో పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తన కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, స్థలాల కబ్జా, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని హామీ ఇచ్చారు. దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నారాయణస్వామి, మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి, ఉమ్మడి జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాతిమా, ఆర్డిఓ విశ్వనాథ్ మున్సిపల్ కమిషనర్ శేషన్న, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ రవికృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించండి

**- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి**





**నంద్యాల బ్యూరో, జూన్ 15 (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల జిల్లాలోని జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాకు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఖండే శ్యామ్ సుందర్ లాల్, జిల్లా అధ్యక్షులు మధుబాబు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చలంబాబు, ఏపీయూడబ్ల్యూజే ట్రెజరీ షేక్ అబ్దుల్ మాలిక్,అక్రిడేషన్  కమిటీ మెంబర్ బొజ్జ శివ,జిల్లా ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ భాషాతో పాటు నంద్యాల పట్టణ అధ్యక్షులు రాజ్ కుమార్ రెడ్డి, యూనియన్ నాయకులు ప్రదీప్, చల్ల మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉండే జర్నలిస్టులు తమ పిల్లల చదువులకై ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని గత కొన్ని సంవత్సరాలుగా కోరుతున్నా, కరోనా సమయం నుండి పాఠశాలల యాజమాన్యం సరిగా స్పందించడం లేదని కలెక్టర్ కు వివరించారు. ఇప్పటికైనా పలు జిల్లాలలో అమలవుతున్న 50% ఫీజు రాయితీని నంద్యాల జిల్లాలో కూడా అమలయేలా చూడాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఫీజు రాయితీ కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటానని యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిడి న్యూస్ శేఖర్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాల అమలులో వేగం పెంచాలి

**రిజిస్ట్రేషన్లు, శిక్షణలు, మ్యాపింగ్ ప్రక్రియలను తక్షణమే పూర్తి చేయాలి  -జిల్లా స్థాయి యోగా పోటీల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

**నంద్యాల బ్యూరో, జూన్ 15( రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో యోగాంధ్ర – 2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న అన్ని కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో యోగాంధ్ర కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగాంధ్ర యాప్‌లో పౌరుల నమోదు ప్రక్రియలో జిల్లా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు చెందిన సుమారు 4 లక్షల మంది సభ్యులు, ఉపాధి హామీ పథకం కింద రెండున్నర లక్షల మంది ఉపాధి శ్రామికులు, 22 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఏడు వేల మంది ఉపాధ్యాయులు, అలాగే 4,500 మంది స్వర్ణగ్రామ్, స్వర్ణవార్డు సిబ్బంది ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిని యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒక దశలో రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్న జిల్లా ప్రస్తుతం 18వ స్థానానికి చేరుకుందని కలెక్టర్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న యోగాంధ్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా అసోసియేషన్ సభ్యులు, జిల్లా అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 6.30 గంటలకు



ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అధికారులు తప్పనిసరిగా పాల్గొని యోగా సాధనపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సిటిజన్ రిజిస్ట్రేషన్, మెనూ మ్యాపింగ్, యోగా పోటీల నిర్వహణ, ట్రైనర్–టు–సిటిజన్ మ్యాపింగ్, సిటిజన్ ట్రెనింగ్ అనే ఐదు కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు, వేదికలు యాప్‌లో నమోదు చేయడం, శిక్షణ పొందుతున్న పౌరుల వివరాలను అప్‌లోడ్ చేయడం వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మిడ్తూరు, జూపాడుబంగ్లా, ఆత్మకూరు, నందికొట్కూరు మండలాలు మెరుగైన పనితీరు కనబరిచాయని అభినందించారు. మరోవైపు నంద్యాల అర్బన్, బేతంచెర్ల అర్బన్, పగిడ్యాల, ప్యాపిలి, బనగానపల్లి ప్రాంతాల్లో అధిక శాతం పనులు పెండింగ్‌లో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా నంద్యాల అర్బన్ పరిధిలో లక్ష్యానికి అనుగుణంగా రిజిస్ట్రేషన్లు జరగలేదని పేర్కొంటూ సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. సిటిజన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ అత్యంత సులభమని, ఆధార్ నంబర్, ఓటీపీ ధృవీకరణతో పాటు ప్రాథమిక వివరాలు నమోదు చేస్తే సరిపోతుందని కలెక్టర్ వివరించారు. అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఈ ప్రక్రియను నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో నిర్వహించిన యోగా పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతల కోసం జిల్లా స్థాయి పోటీలను మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, పోటీదారులు ఉదయం 8.30 గంటలకల్లా వేదిక వద్దకు చేరుకునేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com